# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :123 EDITOR:CHERUKU UPENDAR, DATE : SATURDAY 09 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 123 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 09 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## రూ.7 వేలకు పడిపోయిన పత్తి

అదిలాబాద్- ప్రభాత సూర్యుడు



తెలంగాణ రాష్ట్రంలో పత్తి ధర పడిపోతోంది. క్రమంగా పడిపోతున్న ధర పత్తి రైతులకు కన్నీరు తెప్పిస్తోంది. గతేడాది సాగు చేసిన పత్తిని చాలా మంది రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. అప్పుడు ఆశించిన స్థాయి ధరలు లభించకపోవడం వల్ల వచ్చే ఏడాదైనా ధరలు పెరగకపోతాయా అనే

మిగతా 2లో...

## అమెరికా భారత్ మధ్య
## కీలక ఒప్పందం




న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

దేశ రాజధాని ఢిల్లీలో జీ20 సదస్సు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అతిధుల ఆహ్వాన దగ్గర నుంచి భద్రత, అతిధులకు అతిథ్యం వరకు అన్ని సిద్ధమయ్యాయి. శని, ఆదివారాల్లో జరిగే సదస్సుకు ప్రపంచ నేతలు ఒక్కొక్కరుగా ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. సదస్సుకు ముందే అమెరికా భారత్ మధ్య ఒక కీలక ఒప్పందం జరిగింది. జీ20 శిఖరాగ్ర సదస్సుకు ముందే ఈ ఒప్పంద నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొన్ని అమెరికా వస్తువులపై విధిస్తున్న అదనపు సుంకాలను ఎత్తివేయాలని భారత్ తీసుకుంది. దాదాపు

మిగతా 2లో...

## వేడెక్కనున్న.. తెలంగాణ రాజకీయం

### 17న పోటాపోటీగా బీజేపీ, కాంగ్రెస్ కార్యక్రమాలు
### సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభకు ఏర్పాట్లు




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

సెప్టెంబర్ 17వ తేదీ వస్తుందంటే చాలు ఒక్కసారిగా తెలంగాణ రాజకీయాలు వేడేక్కుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు నుంచి ఈ తేదీకి ఉన్న ప్రాముఖ్యత ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. విమోచం, విలీనం, విద్రోహం ఇలా రకరకాల పేర్లతో సెప్టెంబర్ 17 పొలిటిక్ సర్కిల్స్‌లో హాట్ హాట్‌గా మారుతుంటుంది. ఇక ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతోంది. ఈసారి తెలంగాణ రాజకీయాల్లో ఏకంగా జాతీయ స్థాయిలో చర్చకు కేంద్ర బిందువు కానుంది. సెప్టెంబర్ 17న కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పోటాపోటీన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి.మరీ ముఖ్యంగా తెలంగాణలో ఎన్నికలు సమీపించడంతో సెప్టెంబర్ 17న ప్రత్యేక కార్యక్రమాలకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. అగ్రనాయకుల సభలకు కాంగ్రెస్- బీజేపీ నేతలు ప్లాన్ చేయడంతో రాజకీయం వేడెక్కింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడడటంతో సెప్టెంబర్

మిగతా 2లో...

## ఐదు రోజులపై ఉత్కంఠ



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

మరో తొమ్మిది నెలల్లో భారత లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. స్వాతంత్ర్య భారతంలో ఎన్నడూ లేని విధంగా మూడు అంశాలపై చర్చ జరుగుతుందని, చివరకు అవి మూడూ కూడా చట్ట రూపం దాలుస్తాయని మీడియా కోడై కూస్తోంది. అందులో ఒకటి మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్. ఈ అంశంపై ప్రాంతీయ పార్టీలైన రాష్ట్రీయ జనతాదళ్, సమాజ్‌వాదీ పార్టీ లాంటివి బహిరంగంగా వ్యతిరేకిస్తున్నాయి. కొన్ని పార్టీలు కప్పదాటు వైఖరిని ప్రకటిస్తున్నాయి. ప్రతీ అసెంబ్లీలో, పార్లమెంట్‌లో ముప్పయ్ మూడు శాతాన్ని మహిళలకు

మిగతా 2లో...

## రాజ్‌భవన్‌కు- ప్రగతిభవన్‌కు ఎలాంటి గ్యాప్ లేదు


హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నిబంధనలతో తనను అడ్డుకోలేరన్నారు. రాజ్‌భవన్‌లో జరిగిన కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరించిన అనంతరం మాట్లాడిన గవర్నర్.. ప్రజలకు సేవ చేయడానికే తెలంగాణకు గవర్నర్‌గా వచ్చానన్నారు. కోర్టు కేసులు, విమర్శలకు తాను భయపడనన్నారు. సవాళ్లు, పంతాలు తనను అడ్డుకోలేరన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘనలతో తనను కట్టడి చేయలేరని గవర్నర్ తేల్చి చెప్పారు. తనది మోసం చేసే మనస్తత్వం కాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తాను గవర్నర్ గా నాలుగేళ్లు పూర్తి చేసుకున్నానని ఆమె చెప్పుకొచ్చారు.మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో గవర్నర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ కోట ఎమ్మెల్సీ అనేది పొలిటికల్ నామినేషన్ కాదన్నారామె. ఎమ్మెల్సీ కి అర్హత ఉందని అనిపిస్తే సంతకం చేయడానికి నాకేలాంటి ఇబ్బంది లేదన్నారు. రాజ్‌భవన్‌కు-

మిగతా 4లో...

## రాజన్న దారెటు..?



వరంగల్- ప్రభాత సూర్యుడు

రాజన్న దారెటు? ఆ సిట్టింగ్ ఎమ్మెల్యేకు సీటు నిరాకరించిన గులాబీ బాస్ ఆయనకు ఇచ్చిన ఆఫర్ ఏంటి.. ప్రతిపక్ష పార్టీలు ఇస్తున్న ఆఫర్స్ ఏంటి. డాక్టర్ సాబ్ పొలిటికల్ ఫ్యూచర్ ఏంటి..? వరంగల్ ఉమ్మడి జిల్లాలో చర్చగా మారిన స్టేషన్ ఘన్‌పూర్‌లో ఏం జరగనుంది. లాంటి అంశాలపై ప్రత్యేక కథనంపై ఓ లుక్కేయండి.. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు

మిగతా 3లో...

## అసంతృప్తులను బుజ్జగించే పనిలో కేటీఆర్

మెదక్- ప్రభాత సూర్యుడు



టిక్కెట్ రాని నేతలు, పార్టీ మారిపోతామని లీకులిస్తున్న నేతలు, తాడోపేడో తేల్చుకుంటామని అంతర్గత వార్నింగ్‌లు ఇస్తున్న నేతలు, కుల సంఘాల సాయంతో పార్టీపై ఒత్తిడి తెస్తున్న నేతలుఇప్పుడు బీఆర్ఎస్‌లో దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో కనిపిస్తున్నారు. పార్టీ కోసం సుదీర్ఘంగా పని చేస్తున్నా తమకు టిక్కెట్ ఇవ్వడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరిలో కొంత మంది సీనియర్లు ఉన్నారు. చాలా మంది ఉద్యమకారులు ఉన్నారు. సిట్టింగ్‌లపై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ.. ఎందుకు వారినే కొనసాగిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. అయితే టిక్కెట్ లిస్ట్ ప్రకటనకు ముందే కేటీఆర్ అమెరికా వెళ్లడంతో అసంతృప్తికి గురైన వారిని బుజ్జగించేందుకు ఎవరూ లేరు. కేసీఆర్ ఆ టాస్క్ తీసుకోలేదు. దీంతో అందరూ కేటీఆర్ రాక కోసం ఎదరు చూస్తూ ఉన్నారు. ఇప్పుడు ఆయన వచ్చేశారు. బీఆర్ఎస్ అసలు టాస్క్

మిగతా 2లో...

## మిర్యాలగూడ
## నీదా..నాదా..!




నల్గోండ- ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేస్తోంది. అయితే ఇంతకాలం పార్టీలో పనిచేసిన నేతలు పార్టీ టికెట్ రాకపోతే ప్రత్యామ్నాయం వెతుకునే పనులో పడ్డారు. ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత పార్టీ టికెట్ వస్తుందో రాదోనన్న అనుమానంతో ఉన్నారట. అందుకే ఆయన బీజేపీ వైపు చూస్తున్నారట. స్క్రీనింగ్ జరుగుతోంది. అభ్యర్థుల ప్రకటనకు ముహూర్తం దగ్గరపడుతోంది. దీంతో టికెట్ రేసులో ఉన్న కొందరు లీడర్లలో టెన్షన్ అంతకంతకీ పెరుగుతోంది. కాంగ్రెస్ టికెట్లకోసం నేతలు ఇప్పటికే పోటీలుపడి దరఖాస్తు చేసుకున్నారు. మిర్యాలగూడ టికెట్ కోసం జానారెడ్డి తనయుడు కుందూరు

మిగతా 2లో...

## ఆలేరు బరిలో మోత్కుపల్లి..?

నల్గోండ - ప్రభాత సూర్యుడు



ఈ ఎన్నికల్లో పోటీ చేస్తానని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కుండ బద్దలుకొట్టారు. ఆలేరు నుంచి ఆయన పోటీ చేస్తారని ఆయన సన్నిహితులు అంటున్నారు. ఆలేరు నియోజక వర్గంలో ఏం జరగనుంది? మూడోసారి గెలుపుతో హ్యాట్రిక్ సాధించాలని ఎదురు చూస్తున్న బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతకు ఈ సారి ఎదురుకానున్న సవాళ్లు తప్పవా? ఈ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులంతా ఆమె వెనకే ఉన్నారా?. 1952 నుంచి 1972 వరకు జనరల్ స్థానంగా ఉన్న ఆలేరు నియోజకవర్గం 1978 ఎన్నికల సమయంలో ఎస్సీలకు రిజర్వు అయ్యింది. తిరిగి 2009 ఎన్నికల సమయంలో

మిగతా 3లో...

## దుబాయ్ జైల్లో మగ్గుతున్న
## సిరిసిల్ల వాసుల విడుదలకు
## లైన్ క్లియర్



కరీంనగర్- ప్రభాత సూర్యుడు

చేయని నేరానికి 25 ఏళ్ళు జైల్లో ఉండాల్సి వచ్చింది. దుబాయ్ జైల్లో తెలంగాణ వాసులు పడరాని కష్టాలు పడుతున్నారు. వారిని విడిపించేందుకు ప్రభుత్వం కూడా గట్టిగానే ప్రయత్నిస్తోంది. దేశం కానీ దేశంలో తమవారు జైల్లో ఎలా ఉన్నారో తెలియక బాధితుల కుటుంబ సభ్యులు కన్నీళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇది కథకాదు..రాజన్న సిరిసిల్ల వాసుల కన్నీటి గాథ..ఉపాధి కోసం విదేశాలకు వెళ్తే.. జైలు జీవితాన్ని గడుపుతున్నారు సిరిసిల్ల వాసులు.

మిగతా 3లో...

# రూ.7 వేలకు పడిపోయిన పత్తి

(మొదటిపేజీ తరువాయి)

ఆశాభావంతో చాలా మంది రైతులు పత్తిని నిల్వ చేసుకున్నారు. నిల్వ చేయడం వల్ల బరువు తగ్గి తూకం తక్కువగా వస్తుందని తెలిసినా చాలా మంది తక్కువ ధరకు అమ్ముకోలేక అలాగే తమ వద్ద ఉంచేసుకున్నారు. మరో నెలన్నరో కొత్త పత్తి మార్కెట్లకు రానుంది. ఈ ఏడాది కూడా ధరలు ఆశించినంతగా లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పుడు ఉన్న ధరకు విక్రయిస్తే వచ్చే డబ్బులు అప్పుల వడ్డీలకే సరిపోతాయని రైతులు వాపోతున్నారు. 2022-23 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అయింది. ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి చొప్పున 50 లక్షల ఎకరాల్లో 4 కోట్ల క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు అంచనా. ఈ పంటను ఇంకా 25 శాతానికి పైగా రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. ఉమ్మడి వరంగల్, మహబూబ్ నగర్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలో ఈ పరిస్థితులు ఉన్నాయి. త్వరలో విపణికి కొత్త పత్తి వస్తున్నందు వల్ల.. పాత పత్తికి ధర తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతోంది. గత రెండు సంవత్సరాల నుంచి పత్తి ధర క్రమంగా పతనం అవుతూ వస్తోంది. 2021 సంవత్సరంలో క్వింటా పత్తికి రూ.10 వేల నుంచి రూ. 12 వేల వరకు ధర పలికింది. 2022 సంవత్సరం ప్రారంభంలో రూ. 9 వేల వరకు అమ్ముడు పోయింది. అయితే గతేడాది డిసెంబర్ నుంచి ధర మరింతగా పతనం అవుతూ వచ్చింది. ప్రస్తుతం క్వింటా పత్తికి రూ. 8 వేల నుంచి రూ.7,200 మాత్రమే వస్తోంది.తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం సీజన్ లో వరిసాగు తగ్గుముఖం పట్టింది. సాధారణ వరి సాగు విస్తీర్ణానికి గాను 119 శాతం పెరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపినప్పటీ.. గత సంవత్సరంతో పోలిస్తే తగ్గినట్లు చెప్పారు. వానాకాలం సీజన్ లో రాష్ట్రంలో పంటల సాగు 120.50 లక్షల ఎకరాలకు చేరిందని బుధవారం వ్యవసాయ శాఖ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 124.28 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని లక్ష్యంగా పెట్టుకోగా.. అందులో 97 శాతానికి పంటల సాగు చేరుకుంది. 49,86,634 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను 59,66,886 ఎకరాల్లో అంటే 119 శాతం ఎక్కువగా వరినాట్లు పడ్డట్లు అధికారులు వెల్లడించారు. సంవత్సరం 61,30,584 ఎకరాల్లో వరి సాగు కాగా.. ఈ సంవత్సరం 1,63,698 ఎకరాలు తక్కువగా సాగు అయినట్లు అధికారులు తెలిపారు. పత్తి 50,59,225 ఎకరాల లక్ష్యానికి గాను 44,78,724 ఎకరాల్లో సాగు అవుతోంది. అంటే 88 శాతమే పత్తి సాగులోకి వచ్చింది. మెదక్, మహబూబాబాద్, కుమురంభీం, ఆసిఫాబాద్, జగిత్యాల, జనగామ, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, యాదాద్రి, సంగారెడ్డి, సిద్దిపేట, భద్రాద్రి, వికారాబాద్, నారాయణపేట జిల్లాలు సాగు లక్ష్యాన్ని అధిగమించాయని వ్యవసాయ శాఖ తెలిపింది.

# అమెరికా భారత్ మధ్య కీలక ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

6 అమెరికా ఉత్పత్తులపై భారత్ అదనపు సుంకాలను ఎత్తివేసింది. వీటిలో సెనగలు, ఉలవలు, ఆపిల్స్, వాల్ నట్స్, బాదం ఉన్నాయి. దీనికి బదులుగా పలు ఉత్పత్తులపై భారత్ సైతం అదనపు సుంకాలు విధించింది. వాటిలో కొన్నింటికి తాజాగా మినహాయింపు ఇచ్చింది. జీ 20 చిత్ర సదస్సుకు అగ్రరాజ్య అధ్యక్షుడు జో బైడెన్ హాజరు కానున్న సందర్భంగా ఆయనతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ నేపథ్యంలో భారత్ తాజా నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది.ప్రధాని మోదీ ఇటీవల అమెరికా పర్యటకు వెళ్ళిన విషయం తెలిసిందే. అమెరికా పర్యటన సమయంలో దాదాపు 6 అంశాల్లో నెలకొన్న వాణిజ్య వివాదాలను పరిష్కరించుకునేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి. అందులో తాజాగా అదనపు సుంకాల అంశం కూడా ఉంది. 2023- 24 ఇరుదేశాల మధ్య లేపాక్షిక సరుకు వాణిజ్యం 128.9 బిలియన్ డాలర్లకు చేరింది. మరోవైపు అమెరికా బాదం, వాల్ నట్స్, శనగలు, ఉలవలు, ఆపిల్స్ తదితరాల పై విధించిన అదనపు సుంకాలను ఎత్తివేయాలని జూలైలో రాజ్యసభలో కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. జీ20 సదస్సు దేశ రాజధాని ఢిల్లీ ఆతిథ్యం ఇస్తుండడంతో.... దేశమంతా జీ20 పేరు మారుమోగుతోంది. ప్రధాని మోదీ అధ్యక్షతన అమెరికా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి ప్రపంచ అగ్ర నేతలతో పాటు 40 కి పైగా దేశాల అధినేతలు ఢిల్లీలో రెండు రోజులపాటు భేటీ కానున్నారు.ప్రపంచ వేదికపై అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారత్ వారధిగా నిలవాలన్న లక్ష్యంతో జీ20 అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టింది. ఇందుకు పలు కీలక ఆశయాల సాధనగా ముందుకు వెళుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచ వేదికపై భారత్ ఛాంపియన్ గా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు జీ20 అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే సమయంలో ప్రధాని మోదీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. సమావేశాలు ప్రారంభానికి ముందే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రతినిధులతో మోడీ వర్చువల్గా సమావేశం అయ్యారు. ఇందులో భాగంగా వివిధ దేశాలతో పలు కీలక ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ సదస్సులకు కేవలం ఆర్థిక అంశాలే ప్రధానంగా ఏర్పడింది కాబట్టి... తొలుత జీ20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంకుల గవర్నర్ మాత్రమే ప్రతి సంవత్సరం భేటీకి హాజరయ్యేవారు. కానీ 2008 ఆర్థిక సంక్షోభం అనంతరం ఈ సదస్సును సభ్య దేశాల దేశాధినేతల స్థాయికి పెంచారు. ఏటా జి20 సభ్య దేశాల అధినేతలు శిఖరాగ్ర సదస్సు నిర్వహించి చర్చిస్తుండగా... ఆర్థిక మంత్రుల భేటీలు ప్రతి ఏటా రెండుసార్లు జరుగుతున్నాయి. తలుత ఆర్థిక అంశాలకే పరిమితమైన జీ 20 తర్వాత వాణిజ్యం, ఇంధనం, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం పైన చర్చించడం ఆరంభించింది. ప్రస్తుతం ఢిల్లీ ఈ సదస్సు సిద్ధమవుగా ప్రపంచ దేశాలు ప్రస్తుతం భారత వైపు చూస్తున్నాయి.

# వేడెక్కనున్న తెలంగాణ రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

17న బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలకు ప్లాన్ చేస్తున్నాయి. ఈ నెల 16, 17 తేదీల్లో అచిఅ సమావేశాలు నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధమవుతోంది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకులు, ప్రతినిధులు, ఇతర నాయకులు కలిపి దాదాపు 3 వందల మంది హాజరయ్యే అవకాశం ఉందని పీసీసీ అంచనా వేస్తోంది. ఆ స్థాయిలో ఏర్పాట్లపై ఖఅఅ ఫోకస్ పెట్టింది.మరోవైపు సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ బీజేపీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభకు కమలం పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం తమ తమ పోలింగ్ బూతుల్లో జాతీయ జెండా ఆవిష్కరించి.. సాయంత్రం సభకు వచ్చే విధంగా బీజేపీ నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 17న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.ఇదిలా ఉంటే మరోవైపు అధికార పార్టీ బీఆర్ఎస్ కూడా ఈ విషయంలో తగ్గేదేలే అన్నట్లు దూకుడు ప్రదర్శించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈసారి కేసీఆర్ రూటు మార్చారు. బీజేపీ, కాంగ్రెస్‌ల ఎత్తుగడలకు చెక్ పెట్టేలే సెప్టెంబర్ 16వ తేదీన భారీ బహిరంగ సభ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని నిర్ణయించిన బీఆర్ఎస్ పార్టీ అదే రోజు భారీ బహిరంగ సభను నిర్వహించాలని చూస్తోంది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో సెప్టెంబర్ 17 మరోసారి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారనుంది.

**ఐదు హామీలు ప్రకటించనున్న సోనియా**

తెలంగాణ వచ్చేది కాంగ్రెస్సేనని, ప్రతి ఒక్కరు కూడా కష్టపడి పని చేయాలని, అందరు సమన్వయంతో మెలగాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ సూచిచారు. బుధవారం రాత్రి తాజ్‌కృష్ణా హోటల్‌లోని రేవంత్ రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా పలువురు నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ నేతలకు పలు సూచనలు, సలహాలు చేశారు. రాత్రి 10 గంటల దాకా జరిగిన ఈ సమావేశంలో ఈ నెల 16వ తేదిన నిర్వహించనున్న సీడబ్ల్యూసీ సమావేశాన్ని.. 17వ తేదిన జరిగే బహిరంగ సభలపై కూడా కేసీ వేణుగోపాల్ మాట్లాడారు.

అలాగే సీడబ్ల్యూసీ సమావేశానికి పార్టీ జాతీయ నేతలందరు హాజరవుతున్న తరుణంలో దీన్ని సవాల్‌గా తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలతో సహా పలువురు నేతలు రానున్నారని అన్నారు. వీళ్లు 16,17వ తేదీల్లో హైదరాబాద్‌లోనే ఉంటారని, సభ నిర్వహణకు పార్టీ నేతలతో ఆహార, రవాణా, సమన్వయ తదితర కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే వీటికి నేతలు మధుయాస్కీ, మహేష్ గౌడ్ తదితరులు నాయకత్వం వహించాలని సూచించారు. సభకు ప్రతి మండలం నుంచి కూడా అధిక సంఖ్యలో జనాలు వచ్చేలా ప్లాన్ చేయాలన్నారు. కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వస్తే..5 హమీలపై గ్యారంటీ పత్రాన్ని బహిరంగ సభలో సోనియా గాంధీ విడుదల చేస్తారని అన్నారు. ఈ గ్యారంటీ హామీలను, బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారాలు చేయాలని సూచించారు. అందరి ఐక్యతతో విజయం సాధించ వచ్చని అన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అలాగే సెప్టెంబర్ 18న పార్టీ జాతీయ నేతలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తారని, ఆయా ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తారని అన్నారు. మరోవైపు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కూడా తాజ్‌కృష్ణ హోటల్‌లో.. వేణుగోపాల్, రేవంత్ సహా తదితర నేతలతో చర్చలు జరిపారు. అయితే వచ్చే ఎన్నికల్లో పొత్తులు పెట్టుకుంటే వామపక్షాలకు ఎన్ని సీట్లు ఇవ్వాలనే దానిపై కూడా చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఈనెల 17న నిర్వహించనున్న బహిరంగ సభ కోసం మైదానం ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే సభకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ ఇవ్వాలని.. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ నెల 2వ తేదీన కాంగ్రెస్ పార్టీ దరఖాస్తు చేసుకుంది తెలంగాణ కాంగ్రెస్. కానీ అదే రోజున బీజేపీ కార్యక్రమం ఉండటం వల్ల తమకు ఇస్తారో.. లేదోనన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. చివరికి ఎల్బీ స్టేడియంలో సభను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.

## మిర్యాలగూడ
# నీదా..నాదా..!

(మొదటిపేజీ తరువాయి)

రఘువీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, పీసీసీ వికలాంగుల సెల్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో పాటు బీఎల్ఆర్‌గా అంతా పిలిచే మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి కూడా దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ సీనియర్ లీడర్ వారసుడు రేసులో ఉండటంతో.. మిగిలినవారిలో గుబులు మొదలైంది. ఒకప్పుడు కాంగ్రెస్పార్టీకి కంచుకోటలాంటి మిర్యాలగూడలో జానారెడ్డికి గట్టి పట్టుంది. అందుకే ఆయన కొడుకుని కాదని టికెట్ తమదాకా వస్తుందా అన్న అనుమానంతో ఉన్నారు మిగిలిన నేతలు.ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఎంపీలు ఉత్తమ్, కోమటిరెడ్డిల మద్దతుతో టికెట్ ఆశిస్తున్నారట బీఎల్ఆర్. ఆయనొచ్చాకే మిర్యాలగూడలో పార్టీ బలపడిందన్న భావనతో ఉన్న ఎంపీలు.. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే భాస్కర్‌రావుకి బీఎల్ఆరే సరైన ప్రత్యర్థని భావిస్తున్నారట. కానీ నియోజకవర్గంలో బలమైన అనుచరగణం ఉన్న జానారెడ్డి.. బీఎల్ఆర్ ఆశలకు గండికొట్టేలా ఉన్నారు. కొడుకులిద్దరికీ టికెట్ల విషయంలో జానారెడ్డి పట్టుదలతో ఉండటంతో, కాంగ్రెస్ టికెట్ రాకపోతే ప్రత్యామ్నాయం చూసుకునే ఆలోచనలో ఉన్నారట బీఎల్ఆర్. టికెట్ విషయం తేలాక బత్తుల లక్ష్మారెడ్డి బీజేపీ వైపు వెళ్లొచ్చన్న ప్రచారం బలంగా జరుగుతోంది. మిర్యాలగూడ నుంచి పోటీకి పట్టుదలతో ఉన్నారు జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డి. పీసీసీ చీఫ్ రేవంత్రెడ్డితో రఘువీర్‌కి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఒకవేళ రఘువీర్‌కి టికెట్ ఇవ్వలేకపోతే.. ఆ స్థానాన్ని బీసీలకైనా ఇవ్వాలనే ఆలోచనతో ఉందట కాంగ్రెస్ అధిష్ఠానం. కొడుక్కి కుదరకపోతే రాజకీయ సమీకరణాలతో నల్గొండ పార్లమెంటు పరిధిలో మిర్యాలగూడ టికెట్ బీసీలకు ఇచ్చేలా చూసి.. బీఎల్ఆర్‌కి జానారెడ్డి చెక్ పెట్టే అవకాశం ఉందంటున్నారు. దీంతో ఎటుచూసినా టికెట్ కష్టమేనన్న అభిప్రాయానికొచ్చిన బీఎల్ఆర్.. ముందుజాగ్రత్తగా బీజేపీ నేతలతో టచ్‌లో ఉన్నారట. జానారెడ్డి మాటని కాదని బీఎల్ఆర్‌కి కాంగ్రెస్ టికెట్ దక్కుతుందా.. విషయం తేలాకే ఆయన బీజేపీలో చేరతారా అన్నదే మిర్యాలగూడలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

# అసంతృప్తులను బుజ్జగించే పనిలో కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమయిందని అంచనా వేస్తున్నారు. రకరకాల సమీకరణాలతో టిక్కెట్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతలు బీఆర్ఎస్‌లో పూర్తిగా నిరాశకు గురయ్యాయి. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్నామని.. సామాజిక సమీకరణాల ప్రకారం కూడా తమకు అన్నీ కలసి వస్తాయని .. బలమైన ఓటుబ్యాంకును కలిగున్నామని భావిస్తున్న నాయకులు ప్రకటించిన అభ్య ర్థులను మార్చి తమకే టిక్కెట్లు ఇవ్వాలని కోరుతున్నారు. కేసీఆర్ వారి మొరను ఆలకించ లేదు. అందుకే వారంతా కేటీఆర్ రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఆ నేతల్లో కొందరు వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఊరూరా తిరుగుతూ తమకు టిక్కెట్ దక్కలేదనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు. తమ ఆవేదనను, ఆక్రందనను వెళ్లగక్కుతున్నారు. మరికొందర పార్టీని వీడిపోతామని హెచ్చరిస్తున్నారు. ఇతర పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లుగా సంకేతాలు ఇస్తున్నారు. టిక్కెట్లు సిట్టింగ్ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి రోజూ రోడ్డెక్కుతున్నారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి?తనకు సీటు దక్కనీయలేదంటూ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డిపై తీవ్ర ఆగ్రహావేశాలు వెళ్లగక్కుతున్నారు. ఆయన ఇటీవల అర్ధనగ ప్రదర్శన చేసిన సంగతి విదితమే. పక్కనే ఉన్న స్టేషన్ ఘన్‌పూర్ నుంచి సీటు దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య.. రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆయన త్వరలోనే కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం ఊపందు కుంది. దీంతోపాటు సిరిసిల్ల, సిద్ధిపేటలో మత్స్యకా రులు, ముదిరాజ్‌లు కలిసి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఆ రెండు నియోజకవర్గాల్లో అత్యధిక ఓటు బ్యాంకు కలిగి, బలమైన సామాజిక వర్గంగా ఉన్న తమకే టిక్కెట్ కేటాయించాలంటూ వారు పట్టుబడుతున్నారు. పటాన్‌చెరు నియోజక వర్గంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధు కూడా కారు పార్టీపై తిరుగుబాటు జెండా ఎగరేశారు. ప్రస్తుత అభ్యర్థిని మార్చి.. కచ్చితంగా టిక్కెట్ తనకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. జహీరాబాద్ టిక్కెట్‌ను ఆశించిన ఢిల్లీ వసంత్? బీఆర్ఎస్ అధిష్టానంపై తనదైన పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ‘మట్టి మనుషుల మనోగతం-భూమి పుత్రుల ఆకలి కేక’ అంటూ జహీరాబాద్‌లో నూత్న రీతిలో కార్యక్రమం చేపట్టారు.మరో వైపు సీనియర్ నేతలు తుమ్మల, మండవ వంటి వారు కాంగ్రెస్ లోకి వెళ్తారన్న ప్రచారం జరుగుతోంది. వీరందరికీ టిక్కెట్ భరోసా ఇస్తే బీఆర్ఎస్ లోనే ఉంటారు. అందుకే టిక్కెట్ దక్కిన నేతలకు టెన్షన్ తప్పడం లేదు. కేసీఆర్ నియోజకవర్గాల్లో ఇప్పటికీ సర్వేలు చేస్తూండటంతో ఏం జరుగుతుందో వీరికి అర్థం కావడం లేదు. అధికార పార్టీ నుంచి సీటొస్తే ఓకే. లేదంటే, ఏదో ఒక పార్టీ నుంచి, అదీ కుదరకపోతే స్వతంత్రులుగానైనా బరిలోకి దిగుతామమని హెచ్చరిస్తున్నారు. వీరందర్నీ ఇప్పుడు కేటీఆర్ పార్టీ లైన్ లోకి తేవాల్సి ఉంది.

# ఐదు రోజులపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వడానికి ఏ పార్టీ కూడా సిద్ధంగా లేవు. కానీ బీజేపీ ఈ బ్రహ్మాస్త్రాన్ని వాడుకోడానికి సిద్ధంగా ఉంది. ఒకవేళ మహిళా బిల్లు కనుక పార్లమెంట్ ఆమోదం పొందితే, ఎన్నో ఏళ్లుగా పురుషాధిక్యత కింద నలిగిపోతున్న భారత మహిళ జీవితంలో అది పెను మార్పు అవుతుంది. చట్ట రూపం దాల్చగానే మహిళా సాధికారత సిద్ధిస్తుందని చెప్పడం హాస్యాస్పదం. ఎందుకంటే వార్డు మెంబర్ నుంచి మంత్రి వరకూ ఎదిగినా చాలా సందర్భాల్లో ఇంట్లో ఉన్న మగాళ్లదే డామినేషన్. కానీ ఓ దశాబ్దం తర్వాతైనా మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పు వస్తుంది. ఇది తథ్యం. రెండోది యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ). ఈ విషయంలో భాజపా, దాని తల్లివేరైన ఆరెస్సెస్ మొదట్నుంచీ పట్టుదలగానే ఉన్నాయి. రాజ్యాంగం దేశవాసులందరికీ ఒక్కటే అయినప్పుడు వివాహ చట్టాలు కూడా వేర్వేరుగా ఉండకూడదనేది ఆరెస్సెస్ వాదన. ముఖ్యంగా ముస్లింలలో బహు భార్యాత్వం ఉంటుంది. అలాగే ‘తలాక్’ చెప్పి... విడిపోవడం కూడా చాలా సులువు. తలాక్ పద్ధతిని సుప్రీం కోర్టు నిషేధించినా, భాజపా కూడా యూసీసీ వైపే మొగ్గు చూపుతోంది. 21 లా కమిషన్ మన దేశానికి యూసీసీ అవసరం లేదని చెప్పినా... బీజేపీ ‘ఆ విధంగా’ ముందుకు పోతోంది. యూసీసీ వల్ల హిందువులకు కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉంది. రక్త సంబంధీకుల మధ్య వివాహాలు (మేనరికం లాంటివి) శాస్త్రీయమైనవి కాదు. చట్టం శాస్త్రీయతకే పెద్ద పీట వేస్తే హిందువులకు కూడా ఇబ్బందులు తప్పవు. ఒకే దేశం‘ఒకే ఎన్నికలు అంశాన్ని చర్చించేందుకు ఇప్పటికే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఎక్కువమంది భాజపా సభ్యులే ఉండటంతో కమిటీ నిర్ణయం ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ఇలాంటి కమిటీలో సభ్యునిగా ఉండలేనని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి ఇప్పటికే ప్రకటించారు. రాబోయే తొమ్మిది నెలల్లో దాదాపు పార్లమెంట్‌తో సహా పది రాష్ట్రాలు ఎన్నికలకు వెళ్లనున్నాయి. మరో రెండున్నరేళ్లలో మరో పదిహేను రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జమిలి ఎన్నికలకు వెళ్లడం వల్ల చాలా రాష్ట్ర ప్రభుత్వాలు సగంలోనే తమ పదవీకాలాన్ని ముగించుకోవాల్సి ఉంటుంది. ఇది రాజ్యాంగ సంక్షోభానికి దారి తీస్తుంది. మరి ఈ చిక్కు ముడిని భాజపా ఎలా విప్పుతుందో చూడాలి. యుద్ధ ప్రాతిపదికన బిల్లులు ప్రవేశపెట్టడం.. ఒకట్రెండు రోజుల్లో వాటిని చట్టాలుగా మార్చడం భాజపా ప్రభుత్వానికి కొత్త కాదు. ఐదేళ్ళ కిందట.. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకి పది శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు రెండ్రోజుల్లో చట్టరూపం దాల్చింది. 370వ అధికరణం రద్దు కూడా రెండ్రోజుల్లోనే తేలిపోయింది. దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్కదిద్దుకోవాలని సూచిస్తున్నారు.

# నల్గొండ సీటు వదులుకోవడానికి రెడీ

సిద్దిపేట - ప్రభాత సూర్యుడు

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాట్ కామెంట్స్ చేసారు. సామాజిక సమీకరణాలలో బాగంగా అవసరం అయితే నేను నల్గొండ ఎమ్మెల్యే టికెట్ వదులుకోవడానికి రెడీ అని అన్నారు. సామాజిక సమీకరణాలలో బాగంగా టికెట్ల కేటాయింపులపై మాట్లాడటానికి ఠాక్రే నా దగ్గరికి వచ్చారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించిన తరువాత ఎలా ఉంటుందో చూడండి. స్టార్ క్యాంపెయినర్ గా నా పని నేను చేస్తా. సోషల్ మీడియాలో ఎవరెవరో ఏదేదో రాస్తున్నారు..నాకు ఎవరిపై అసంతృప్తి లేదని అన్నారు.

## సంపాదకీయం

### ఇండియాను

# పుట్టిముంచనున్న డీఎంకే

ఉదయనిధి స్టాలిన్... సినిమా నటుడు, నిర్మాత. అంతకు మించి డీఎంకే అధినేత స్టాలిన్ కొడుకు. తమిళనాడులో యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి. తండ్రి ముఖ్యమంత్రి అయితే కొడుకు క్యాబినెట్‌లోకి రావడానికి వేరే అర్హతలు అవసరం లేదు. మన తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటివి కొత్త కాదు. ఈ మధ్య అతను దేశవ్యాప్తంగా బాగా పాపులర్ అయ్యాడు. ఈ విషయంలో తండ్రి పాత్ర ఇసుమంతైనా లేదు. సనాతన ధర్మాన్ని పూర్తిగా నిర్మూలించాంటూ వివాదాస్పద వ్యాఖ్యలతో ఆయన ఓవర్ నైట్ నేషనల్ స్టార్ అయిపోయాడు. ఈ అదృష్టం ఎక్కడో నూటికో కోటికో ఒకరికే పడుతుంది ఉదయనిధి ఎంతలా 'ఎదిగి' పోయాడంటే.. కేంద్ర క్యాబినెట్ భేటీలో ప్రధానమంత్రి కూడా స్వయంగా స్పందించేంత. ఇక మరో డీఎంకే నేత రాజా అయితే సనాతన ధర్మాన్ని ఎయిడ్స్ పోల్చాశాడు... వీరద్దరి వ్యవహారంతో బీజేపీకి తంతే బూరెల బుట్టలో పడినట్టయింది. 'సనాతన' అంశాన్ని వదలొద్దంటూ మోదీ తన మంత్రివర్గ సహచరులకు దిశా నిర్దేశం చేసేంతగా! ఈ విషయంపై ఎంత రచ్చ అయితే భీజేపీకి అంత మంచిది. తమిళనాడులో కూడా 'హిందూ' భావోద్వేగాలను రెచ్చ గొడితే అక్కడ అంత తొందరగా పాగా వేయవచ్చనేది మోదీ అండ్ టీమ్ ప్లాన్. దక్షిణాది కమలం పార్టీకి కొరకరాని కొయ్యగా తయారైంది. ఉన్న కర్ణాటకలో కూడా ఈ మధ్యే అధికారం హరీ అంది. హిందూ ఓట్ల గంపగుత్తగా తమకే పడాలని ఆరెస్సెస్, భాజపా ఆలోచన. కుర్ర స్టాలిన్ వ్యాఖ్యలు కేంద్రంలో అధికార పార్టీకి ఆక్సిజన్ అందించాయి. తమిళనాడు ఓ విచిత్రమైన రాష్ట్రం. అక్కడ పెరియార్, అన్నాల ఆలోచన విధానం ఉంటుంది. అక్కడే పరువు హత్యలు కూడా ఉంటాయి. అక్కడే కుల వివక్ష ఉంటుంది,. నాలుగు దశా బ్దాలుగా డీఎంకే, అన్నా డీఎంకే మాత్రమే అధికారాన్ని పంచుకుంటున్నాయి. వెనువెంటనే రెండో సారి అధికారంలోకి వచ్చిన పార్టీ అన్నా డీఎంకే మాత్రమే. ఆ రెండు సార్లూ ముఖ్యమంత్రులను కోల్పోయిన దురదృష్టం కూడా ఆ పార్టీదే. ఎంజీయార్, జయలలిత వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి, అధికారంలో ఉండగానే మరణించారు. ఈ ప్రాంతీయ పార్టీల హవాలో కాంగ్రెస్ తన ఉనికిని ఎప్పుడో కోల్పోయింది. భాజపా తమిళనాట జెండా పాతడానికి ఉవ్విళ్ళూరుతోంది ఈ నేపథ్యంలో తన వ్యాఖ్యలపై ఉదయనిధి మరింత దృఢంగా నిలబడ్డారు. ఆయనకు అనుకూలంగా కూడా మరి కొందరు మాట్లాడుతున్నారు. కానీ కాంగ్రెస్ ఈ వివాదం నుంచి తప్పించుకోడానికి ప్రయత్నిస్తోంది. కర్ణాటకలోని కాంగ్రెస్ మంత్రి మాత్రం 'సనాతన ధర్మం' నిర్మూలన వ్యాఖ్యలను సమర్ధించారు. ఉత్తరాదికి చెందిన ఓ మఠాధిపతి ఉదయనిధి తల తెచ్చినవాళ్ళకు పదికోట్లు ఇస్తానని చెప్పడం వివాదాస్పదమైంది. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా, అనుకూలంగా సోషల్ మీడియా హోరెత్తుతోంది ఈ రచ్చే భాజపాకు కావాలి. హిందూ ఓట్లు పోలరైజ్ అవ్వాలి. నూరు లక్షల కోట్ల అప్పు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగిత నుంచి ప్రజల దృష్టిని భావోద్వేగాల వైపు మళ్లించాలి. రాబోయే ఎన్నికల్లో ప్రతి రాష్ట్రంలో భాజపా ఉదయనిధి వ్యాఖ్యలపై మాత్రమే మాట్లాడుతుంది. అక్కడ నుంచి హిందూ ఓట్లను దండుకుంటుంది. దీనివల్ల జూనియర్ స్టాలిన్ కొన్నాళ్లు మీడియా లైమ్‌లైట్‌లో ఉంటాడు. ప్రధానమంత్రి సమావేశాన్ని ఏర్పాటు చేసి నన్ను అనుమతిస్తే, క్యాబినెట్ మంత్రులందరికీ సమాధానాలు ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మీరు నిర్ణయించిన తర్వాత 'సనాతన ధర్మం' ఏది అని నేను వివరిస్తాను.' అని రాజా అన్నారు. పుదుచ్చేరిలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాజ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలను సమర్ధించారు. దీనిపై అమిత్ షా లేదా ఇతర బీజేపీ ముఖ్య నేతలు ఎవరైనా తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు.సనాతన ధర్మం ప్రజల మధ్య అసమానతలను ప్రోత్సహించిందని, మహిళల హక్కులను అరికట్టిందని అన్నారు. భర్త మరణిస్తే అతడి చితిపై కూర్చుని భార్య ప్రాణత్యాగం చేసే సతీసహగమనాన్ని సమర్ధించిందని అన్నారు. 'అటువంటి పద్ధతులను పునరుద్ధరించాలనుకుంటున్నారా? మనం అన్ని అసమానతలతో పోరాడాం.. ఈ సనాతన ధర్మాన్ని అంగీకరిస్తే.. మనం పెరియార్ (ద్రవిడ కజగం వ్యవస్థాపకుడు ఈవీ రామసామి), అన్నా (తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై), కలైంజ్ఞర్ (కరుణానిధి) సూచించిన సూత్రాలకు వ్యతిరేకం. ఈ ధర్మాన్ని అంగీకరించడం వల్ల తోటి మానవులకు మనల్ని శత్రువులుగా మారుస్తారు, నేను ఈ ధర్మాన్ని అంగీకరిస్తే నేను మనిషిని కాదు' అని రాజా ఉద్ఘాటించారుకానీ ప్రతిపక్షాల ఉమ్మడి కూటమి 'ఇండియా' మాత్రం ఇబ్బంది పడుతుంది. ఉదయనిధి వల్ల 'ఇండియా బ్లాక్'కు వచ్చే నెగటివ్ ఓట్ తమిళనాడులోనే కాకుండా దేశమంతా ప్రతిఫలించాలని భాజపా భావిస్తోంది. అదే కనుక జరిగితే... కేంద్రంలో భాజపా గెలుపు నల్లేరు మీద నడకే. అటు తిరిగి.. ఇటు తిరిగి.. ఉదయనిధి స్టాలిన్, మాజీ మంత్రి రాజా 'ఇండియా' పుట్టి ముంచేలా ఉన్నారు.

### ఆధార్ ఫ్రీ అప్ డేట్స్ కోసం

# మరో 3 నెలలు

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఆధార్ కార్డులను జారీ చేసే అధీకృత సంస్థ ఉడాయ్ మళ్లీ గుడ్ న్యూస్ చెప్పింది. ఆధార్‌లోని వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకునే చివరి తేదీని రెండోసారి కూడా పెంచింది. వాస్తవానికి ఈ లాస్ట్ డేట్ ఈ ఏడాది జూన్ 14తోనే ముగిసినా, ఉడాయ్ ఆ గడువును మరో మూడు నెలల వరకు పెంచి, ఫ్రీ ఆఫర్‌ను సెప్టెంబరు 14వ తేదీ వరకు అందుబాటులోకి ఉంచింది. ఇప్పుడు, ఈ తేదీని కూడా ఇంకో మూడు నెలలు పెంచి డిసెంబర్ 14 వరకు పొడిగించింది. మీ ఆధార్ కార్డ్‌లో పుట్టిన తేదీ తప్పుగా ఉన్నా, పేరులో స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉన్నా, మీ అడ్రస్ మారినా ఫ్రీగా అప్‌డేట్ చేసుకోవడానికి 14 డిసెంబర్ 2023 వరకు సమయం ఉంది. ఐఎఆంఎ వెబ్‌సైట్ ప్రకారం, ఆధార్ కార్డ్‌లో కచ్చితమైన సమాచారం ఉండేలా ప్రతి ఆధార్ కార్డ్ హోల్డర్ చూసుకోవాలి. ఆధార్ డిటైల్స్‌లో ఏవైనా తప్పులు ఉంటే, తగిన ప్రూఫ్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసి వివరాలు అప్‌డేట్ చేయాలి. ఉడాయ్ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ ఆధార్ కార్డ్‌ను 'ఫ్రీ'గా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయొచ్చు. దీని కోసం, ఆధార్ నంబర్, లింక్‌డ్ మొబైల్ ఫోన్‌ను దగ్గర పెట్టుకోవాలి. పోర్టల్‌లో ఆధార్ నంబర్‌తో లాగిన్ అయిన తర్వాత, మొబైల్ నంబర్‌కు వచ్చే ాుఖ ద్వారా మీ వివరాలను అప్‌డేట్ చేయవచ్చు. ఆఫ్‌లైన్/ఆధార్ కేంద్రం/ఉూఅ కి వెళ్లి ఆధార్ సమాచారం అప్‌డేట్ చేయాలనుకుంటే మాత్రం 25 రూపాయలు ఛార్జీ చెల్లించాలి.

### యూనివర్సిటీ

# కాంట్రాక్ట్ టీచర్ల ఆందోళన

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ సంఘం ఆద్వర్యంలో కాంట్రాక్ట్ టీచర్లు ఆందోళనకు దిగారు. రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిజాం కాలేజ్ లో ఆందోళన చేసారు. గన్ పార్క్ వద్దకు ర్యాలీగా వెళ్లిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేసారు. 12 యూనివర్సిటీ లలో పెన్ డౌన్ లో భాగంగా గన్ వరకు ర్యాలీకి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వాన్ని అనేక రకాలుగా విజ్ఞప్తి చేసినా.. తమను ఎందుకు రెగ్యులరైజ్ చేయడం లేదు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని..అమలు చేయడం లేదు. ఎంతో మందికి పాఠాలు చెప్పాం.. గొప్ప వారు అయ్యారు.. పోలీసులు అయ్యారు ఇపుడు ఆ పోలీసుల చేత మమ్మల్ని అరెస్ట్ చేయిస్తున్నారు. ఇంత దారుణమా.. మాకు న్యాయం చేయాలని వారన్నారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేసారు.

# రాజన్న దారెటు..?

(మొదటిపేజీ తరువాయి)

ఉండగా, 9 స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్ళీ సీట్లు ఖరారు చేసిన గులాబీ బాస్ కేసీఆర్ జనగామ జిల్లాలో ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీటులేదని చెప్పేశారు.కేవలం జనగామ సీటు మాత్రమే ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. టికెట్ల ప్రకటన తర్వాత హాట్ సీట్‌గా పేరున్న స్టేషన్ ఘనపూర్‌లో రాజకీయం మరింత వేడెక్కింది. సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య స్థానంలో స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్‌ని ఎమ్మెల్సీ కడియం శ్రీహరికిచ్చారు పార్టీ అధినేత. అసలే ఆ ఇద్దరి మధ్య మొదట్నించీ రచ్చ నడుస్తోంది. తన టికెట్‌ని కడియం లాగేసుకోవటంతో పోరాడితే పోయేదేంలేదన్నట్లు దూకుడుపెంచారు రాజయ్య. కడియంకు తన సిట్టింగ్‌సీటును కట్టబెట్టడంతో స్వరం పెంచిన రాజయ్య సంచలన వ్యాఖ్యలతో కాక రేపుతున్నారు. మొదట తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు ఎమ్మెల్యే. ఆయన్ని చూసిన కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు అయ్యో రాజయ్యా అన్నారు. పార్టీ పెద్దలనుంచి బుజ్జగింపు ప్రయత్నాలు జరుగుతున్నా.. స్వరం పెంచిన ఎమ్మెల్యే రాజయ్య ఇప్పుడు కడియం శ్రీహరిపై బాణాలు ఎక్కు పెట్టారు.తన జాతిని ఐక్యం చేస్తున్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన రాజయ్య.. రిజర్వుడ్ సీట్లో ఆ వర్గమంతా తనవైపే పేనంటూ బలప్రదర్శనకు దిగుతున్నారు. కడియం శ్రీహరిలో కలవరం పుట్టిస్తున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మొదట్నించీ ఎస్సీల్లో మెజారిటీ వర్గానికి ఇస్తున్న సీటు. ఈసారి కూడా ఆ సీటుని మాదిగలకే కేటాయించాలన్న డిమాండ్ చేస్తూ బలమైన వాదన వినిపిస్తున్నారు రాజయ్య. ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగతో పాటు, మాదిగ అనుబంధ సంఘాల్లో ఓవర్గం ఆయనకు మద్దతుగా నిలిచింది. దళిత మేధావులు, ఆ వర్గ ప్రజా ప్రతినిధులను సమన్వయపరిచి స్టేషన్ ఘనపూర్ సీటు కోసం పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే ఉన్నారు సిట్టింగ్ ఎమ్మెల్యే. ఈ క్రమంలోనే రెండ్రోజుల క్రితం ఆయన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహని హనుమకొండలో కలవడం చర్చకు దారి తీసింది. రాజనర్సింహతో హోటల్ గదిలో కాసేపు రాజయ్య చర్చించడంతో.. ఆయన పార్టీ మారబోతున్నారంటూ ప్రచారం జరిగింది. పార్టీ వీడతానన్న ప్రచారానికి తెరదించారు రాజయ్య. పార్టీ మారే ఆలోచన లేదని ప్రకటించారు. మాదిగల అస్థిత్వానికి అన్యాయం జరగకుండా చూసేందుకే పోరాడుతున్నానన్నారు రాజయ్య.

దామోదర రాజనర్సింహతో భేటీతో బీఆర్ఎస్ నాయకత్వం అప్రమత్తమైంది. రాజయ్యకి బుజ్జగింపుల పర్వం మొదలైంది. అధిష్ఠాన దూతగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ రంగంలోకి దిగారు. రాజయ్య ఇంటికి వెళ్లి మంతనాలు జరపడం, ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేయడం ఘన్‌పూర్ రాజకీయంలో లేటెస్ట్ అప్‌డేట్. ఇప్పటికే గులాబీ బాస్ రాజయ్యకు బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. ఎమ్మెల్సీ లేదంటే వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి రాజయ్యను బరిలోకి దింపే ఆలోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం.అధినేత మనసులోని మాట పార్టీ నేతలద్వారా రాజయ్యకి చేరిందం టున్నారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలిస్తే ఆయన ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అవుతుంది.. కాబట్టి ఆ సీటును రాజయ్యకు కేటాయించడమో లేదంటే వరంగల్ ఎంపీ గా ఆయన్ని బరిలోకి దింపే ఆలోచనలో కూడా బీఆర్ఎస్ నాయకత్వం ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం వరంగల్ ఎంపీగా ఉన్న పసునూరి దయాకర్ పెద్దగా ప్రభావం పెద్దగా కనిపించకపోవడంతో ఆయన స్థానంలో అదే మాదిగ సామాజిక వర్గానికి చెందిన రాజయ్యని దించే ఆలోచన కూడా చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఓవైపు బీఆర్ఎస్ నాయకత్వం రాజయ్యకి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగానే.. అటు కాంగ్రెస్‌నుంచి కూడా ఆయనకు ఆఫర్ ఉందన్న మాట వినిపిస్తోంది. పార్టీలో చేరితే స్టేషన్‌ఘన్‌పూర్ టికెటిస్తామని ఆఫర్ చేసిందట కాంగ్రెస్ పార్టీ. మరి రాజయ్య అధికారపార్టీలోనే కొనసాగి అధినేత ఆఫర్‌ని అందుకుంటారా.. లేదంటే ఇదే స్పీడ్ కంటిన్యూ చేస్తారా అనేది రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. అయితే ఎమ్మెల్సీ లేదా ఎంపీ ఆఫర్ రెండూ ఇచ్చినా.. అందులో ఏదయినా సరే ముందే ప్రకటించాలని పట్టుబడుతున్నారట రాజయ్య. మరి ఆఫర్లకు రాజయ్య సరెండర్ అవుతారా.. లేక తగ్గేదే లేదంటూ తాడోపేడో తేల్చుకుంటారో చూడాలి.

### దుబాయ్ జైల్లో మగ్గుతున్న సిరిసిల్ల

# వాసుల విడుదలకు లైన్ క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క వ్యక్తి హత్య కేసు లో.. నిందితులుగా జిల్లా వాసులను చేర్చారని వారి కుటుంబీకులు రోధిస్తూ చెప్పారు. అక్కడి బాషా రాక.. అక్కడి చట్టాలు తెలియక జైల్లో మగ్గుతున్నారని వాపోయారు. వారిని విడిపించేందుకు ఇటు రాష్ట్ర ప్రభుత్వం తో పాటు అటు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది. నేపాలి హత్య కేసులో వీరిని దోషులుగా తెల్చింది అక్కడి కోర్టు.రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూర్ గ్రామానికి చెందిన శివరాత్రి మల్లేశం, రవి చెందిన ఇద్దరు అన్నదమ్ములు, చందుర్తి మండలానికి చెందిన ఇద్దరు గోళం నాంపల్లి, శివరాత్రి హనుమండ్లు, కొనరావుపేట గ్రామానికి చెందిన దండుగుల లక్ష్మణ్ దుబాయ్ కి వెళ్ళారు. వెళ్లిన ఆరు నెలల అనంతరం నేపాల్ కు చెందిన బహదూర్ సింగ్ అనే వాచ్మెన్ హత్యకు గురయ్యాడు. అక్కడే పని చేస్తున్న జిల్లా వాసులు ఈ ఐదుగురు కేసులో ఇరుక్కున్నారు భాష సరిగా రాకపోవడంతో పోలీసులకు ఏం చెప్పారో తెలియదు కానీ శిక్ష రుజువు కావడంతో దుబాయ్ కోర్టు మొదట పదేళ్లు జైలు శిక్ష వేశారు అనంతరం? 25 ఏళ్ల శిక్ష విధించింది. దుబాయ్ చట్టాల ప్రకారం హత్య గురైన వ్యక్తి కుటుంబ సభ్యులు క్షమా భిక్ష పెడితే విడుదల అవకాశం ఉండగా 2011లో ఎమ్మెల్యే కేటీఆర్ చొరవ తీసుకొని ఒకసారి నేపాల్ కూడా వెళ్లి వచ్చారు. హత్యకు గురైన వ్యక్తి కుటుంబ సభ్యులతో లాయర్ అనురాధ, ఇతర ప్రతినిధుల సహకారంతో సంతకాలు చేయించారు. వారికి ఆర్థికంగా కేటీఆర్ పదిహేను లక్షల రూపాయల చెక్కును అందించారు. అప్పుడే దుబాయ్ లో చట్టాలు మారడంతో విడుదల గగనమైంది. వీరి క్షమాభిక్ష పిటిషన్ దుబాయ్ కోర్టు కొట్టి వేసింది. సెప్టెంబర్ లో మంత్రి కేటీఆర్ దుబాయ్ కోర్టులో బాధిత కుటుంబ సభ్యులతో కేసు వేయించడం, కేంద్ర విదేశాంగ శాఖ సహకారంతో దుబాయ్ రాజు అపాయింట్మెంట్ సాధించి ఈ కేసులో క్షమాభిక్ష కోరడం కోసం.. కానీ అదే సమయం లో మంత్రి కేటీఆర్ కాలుకు ఫ్రాక్చర్ కావడంతో దుబాయ్ వెళ్ళలేక పోయాడు. అనంతరం బాధిత కుటుంబాలను కూడా దుబాయ్ తీసుకు వెళ్లేందుకు గత సంవత్సరం అందరికీ పాస్‌పోర్ట్ తీసుకుని వెళ్లాల్సి ఉండగా మంత్రి కేటీఆర్ కాలుకి ఫ్రాక్చర్ అవ్వడం తో దుబాయ్ పర్యటన రద్దైంది. దుబాయ్ చట్టాలు తరుచూ మారడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా జైల్లో మగ్గుతున్న తమ వారిని తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావాలని బాధిత కుటుంబాలు కోరుకుంటున్నారు. తాము ఈ హత్య చేయలేదని పాకిస్తాన్ దేశియులు హత్య చేసారని.. బాధితుల తరుపున న్యాయ వాదులు అంటున్నారు.. వీరిని విడిపించేందుకు ప్రయత్నం చేస్తున్నామని కేటీర్ చెప్పారు.

# ఆలేరు బరిలో మోత్కుపల్లి..?

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా జనరల్ స్థానం అయ్యింది. ఆలేరుకు ఇప్పటి దాకా 16 ఎన్నికలు జరిగాయి. ఇందులో అత్యధికంగా.. వరసగా అయిదుసార్లు విజయం సాధించిన రికార్డు మాత్రం మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుదే. ప్రస్తుతం ఆయన అధికార బీఆర్ఎస్ లో ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో పోటీ కోసం ఆలోచిస్తున్నారని మోత్కుపల్లి సన్నిహితులు చెబుతున్నారు. కానీ ఇప్పటికే బీఆర్ఎస్ నాయకత్వం సిట్టింగ్ ఎమ్మెల్యే గొంగిడి సునీత పేరును ఖరారు చేసింది.ఆలేరు నియోజకవర్గంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఇటీవల ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొని చేసిన ప్రకటన చర్చకు దారితీసింది. 1983 నుంచి 1999 వరకు అయిదు సార్లు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మోత్కుపల్లి. మూడు సార్లు టీడీపీ నుంచి, ఒకసారి ఇండిపెండెంటుగా, మరోసారి కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. ఆలేరు జనరల్ స్థానం కావడంతో పొరుగునే ఉన్న తుంగతుర్తి ఎస్సీలకు రిజర్వు కావడంతో అక్కడికి వలస వెళ్లి ఆ నియోజకవర్గం నుంచి కూడా టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. మొత్తంగా ఆరు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన సీనియర్ నాయకుడైన మోత్కుపల్లి నర్సింహులు పరిస్థితి ఇప్పుడు డైలమాలో పడింది.టీడీపీ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించిన మోత్కుపల్లి నర్సింహులు.. కాంగ్రెస్ కు, అక్కడి నుంచి తిరిగి టీడీపీకి, అటు నుంచి అటు బీజేపీకి.. అక్కడ ఇమడలేక బీఆర్ఎస్ గూటికి చేరారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మోత్కుపల్లి నర్సింహులు సేవలు వినియోగించు కుంటామని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మోత్కుపల్లి చేరిక సందర్భంగా ప్రకటించడంతో ఎమ్మెల్యేగా ఎక్కడా సర్దుబాటు చేయలేకపోతే, ఎమ్మెల్సీ పదవైనా దక్కుతుందని అంతా భావించారు. మోత్కు పల్లి అనుచరులు సైతం ఇదే ఆశించారు. కానీ, పార్టీలో చేరిన తర్వాత ఒకటీ రెండు సార్లు మినహా మళ్లీ సీఎం కేసీఆర్ ను కలిసే అవకాశమే మోత్కుపల్లికి దక్కలేదని చెబుతున్నారు. దీంతో తీవ్ర నిరాశకు గురైన నర్సింహులు అధినాయకత్వంపై ఆగ్రహంగా ఉన్నారని సమాచారం. ఆలేరు నుంచి ఇప్పటికే రెండు సార్లు విజయాలు సాధించి మూడో గెలుపు కోసం ఎదురు చూస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే గొంగిడి సునీతకు టికెట్ ఖరారు చేశారు సీఎం కేసీఆర్. కావాలని డిమాండ్ చేసిన నాయకుడు కానీ, సునీతకు ఇచ్చిన టికెట్ వాపస్ తీసుకుని కొత్త అభ్యర్థిని ప్రకటించాలని కానీ కోరిన అసమ్మతి నాయకుడు లేడు. అయితే ఇటీవల ఆలేరు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సునీత, ఆమె భర్త డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి మోత్కుపల్లి నర్సింహులు సైతం హాజరయ్యారు. సీనియర్ నాయకుడిగా ఆయనకు ప్రసంగించే అవకాశం ఇచ్చారు. మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ గా ప్రమాణ స్వీకారం చేస్తోంది మోత్కుపల్లి కోడలే కావడంతో ఆయనను మాట్లాడాల్సిందిగా కోరారు. ఈ సమయలోనే ఆయన తన మనసులోని మాట బయట పెడుతూ.. నేనైతే ఈ సారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నా.. మీరంతా నావెంట ఉంటారా? ఉండరా? సహకరిస్తారా? లేదా? అంటూ చేసిన ప్రసంగంపై చర్చ జరిగింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఈ ఎన్నికలకూ టికెట్ పొందిన సునీత సమక్షంలోనే ఆయన తన పోటీపై కుండబద్దలు కొట్టడంతో చర్చ జరుగుతోంది? మోత్కుపల్లి నర్సింహులు ఏం చేయబోతున్నారు? నిజంగానే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తారా? చేస్తే ఏ పార్టీ నుంచి? లేదా ఇండిపెండెంట్ గా చేస్తారా? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది.

# ఇండియా, సౌదీ, అమెరికా మెగా చర్చలు

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

పెరుగుతున్న చైనా ప్రభావాన్ని అడ్డుకునేందుకు అగ్రదేశం అమెరికా, భారత్ పావులు కదుపుతున్నాయి. రైల్, ఓడరేవుల మెగా డీల్‌పై అమెరికా, సౌదీ అరేబియా, భారత్, ఇతర దేశాలు చర్చలు జరుపుతున్నట్టు రాయిటర్స్ శుక్రవారం ప్రకటించింది. దీనిపై అమెరికన్ న్యూస్ లెటర్ ఆక్సియోస్ కథనాన్ని నివేదించింది. సౌదీ అరేబియా, ఇజ్రాయిల్ మధ్య 2024కి ముందే సాధారణీకరణ ఒప్పందాన్ని పూర్తి చేయాలని బైడెన్ అడ్మినిస్ట్రేషన్ భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా లెవాంట్, గల్ఫ్ లోని ఇతర అరబ్ దేశాలను కలుపుతుందని భావిస్తున్నారు. గల్ఫ్ లోని ఓడరేవుల ద్వారా భారతదేశాన్ని కూడా ఈ ప్రాజెక్టుతో అనుసంధానించనున్నారు.భారత్, ఇజ్రాయిల్, అమెరికా,యూఏఈ సభ్యదేశాలుగా ఉన్న ఐ2యూ2 సమావేశంలో ఈ ప్రాజెక్టు ఆలోచన వచ్చింది. మిడిల్ ఈస్ట్ లో మౌలిక సదుపాయాల గురించి చర్చించడానికి, ఆ ప్రాంతంలో చైనా ప్రాబల్యం పెరుగుదలకు ధీటుగా ఐ2యూ2 ఫోరమ్ 2021లో ఏర్పాటైంది. ఈ ప్రాంతాలను రైల్వే ద్వారా అనుసంధానించాలనే ఆలోచనను ముందుగా ఇజ్రాయిల్ లేవనెత్తింది. ఈ ప్రాజెక్టులో భారత నైపుణ్యాన్ని ఉపయోగించాలని ఈ ఆలోచన చేసింది. ఈ దేశాలతో పాటు ఇందులో సౌదీ అరేబియా భాగస్వామ్యాన్ని బైడెన్ అడ్మినిస్ట్రేషన్ విస్తరించింది. చైనా బెల్ట్ అండ్ రోడ్ విజన్ ను అడ్డుకునేందుకు ఈ దేశాలు ఈ మెజా ప్రాజెక్టుపై ఆలోచన చేస్తున్నాయి.ఈ మేజర్ రైల్వే ప్రాజెక్టు ద్వారా గల్ఫ్, అరబ్ దేశాలను అనుసంధానం చేయడానికి భారత్, యూఏఈ, సౌదీతో అమెరికా రైల్వే ఒప్పందం చేస్తున్న తరుణంలో దీనిపై వైట్‌హౌజ్ ప్రతినిధి జెక్ సుల్లివన్ మాట్లాడుతూ.. దీనిపై ప్రస్తుతం నేను ఏం ధృవీకరించలేదనని.. మేము మా భాగస్వామ్య సభ్యదేశాలతో కలిసి కృషి చేస్తాం. భారతదేశం నుంచి మిడిల్ ఈస్ట్, ఐరోపా కనెక్టివిటీ చాలా ముఖ్యమైందని, ఇందులో అన్ని దేశాలు ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు పొందుతాయని అన్నారు.

# మణిపూర్ లో టెన్షన్

ఇంపాల్- ప్రభాత సూర్యుడు

త నాలుగు నెలలు మణిపూర్ రాష్ట్రంలో జాతుల మధ్య ఘర్షణలు తలెత్తుతూనే ఉన్నాయి. శాంతి నెలకొంటుందనుకునే సందర్భంలో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా మరోసారి మణిపూర్ లో టెన్షన్ వాతావరణం తలెత్తింది. భద్రతా బలగాలు, సాయుధ సిబ్బంది మధ్య తాజాగా కాల్పులు చోటు చేసుకోవడంతో ఉద్రిక్తంగా మారింది. తెంగ్నౌపాల్ జిల్లాలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. తెల్లవారుజామున మణిపూర్‌లోని తెంగ్నౌపాల్ జిల్లాలోని పల్లెల్ ప్రాంతంలో భద్రతా బలగాలు, సాయుధ వ్యక్తుల మధ్య కాల్పులు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటలకు నుంచి ప్రారంభమైన కాల్పులు అడపాదడపా కొనసాగుతున్నాయి. భద్రతా బలగాలు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. అంతకుముందు బుధవారం బిష్ణుపూర్ జిల్లాలోని ఫౌగాగ్ చావో ఇఖాయ్ లో వేలాది మంది గుమిగూడి ఆర్మీ బారికేడ్లను తొలగించే ప్రయత్నం చేశారు. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత తాజా కాల్పులు చోటు చేసుకున్నాయి. బుధవారం జరిగిన ఘటనలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఖీఎఈ), అస్సాం రైఫిల్స్, మణిపూర్ పోలీసు బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించి అల్లర్లను అదుపు తెచ్చే క్రమంలో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ నిరసనలకు ఒక రోజు ముందు మణిపూర్ లోని 5 లోయ జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు.ఈ ఏడాది మే3న మణిపూర్ లో జాతుల మధ్య హింస చెలరేగింది. మెయిటీ, కుకీ వర్గాలు ఒకరిపై ఒకరు, గ్రామాలపై దాడులు చేసుకుంటూ, ఇళ్లను తగలబెట్టుకున్నారు. ఈ ఘర్షణల్లో ఇప్పటి వరక్? 160 మందికి పైగా చనిపోయారు. వందల మంది గాయపడ్డారు. ఎస్టీ హోదా కోసం మెజారిటీ మెయిటీ కమ్యూనిటీ డిమాండ్ చేయడం, దీన్ని కూకీలు వ్యతిరేకించడంతో తగాదా ప్రారంభమైంది. మణిపూర్ జనాభాలో 53 శాతం మెయిటీలు 10 శాతం ఉన్న ఇంఫాల్ లోయ ప్రాంతంలో ఉంటే 40 శాతం మైనారిటీ కుకీలు 90 శాతం ఉన్న కొండ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఇదే ఈ రెండు తెగల మధ్య వివాదానికి కారణమైంది.

# 5089 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

నిరుద్యోగులు కల ఎట్టకేలకు నెరవేరింది. తెలంగాణలో 5089 టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. సెప్టెంబర్ 20 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 21 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుంది. నవంబర్ 20 నుంచి 30 వరకు తెలంగాణ డీఎస్సీ పరీక్ష-2023 జరుగుతుంది. పశ్నాపత్రాల లీకేజీ లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు ఆన్ లైన్ లో ఎఖీ పరీక్షలు జరపనున్నారు.ఈ క్రమంలో నోటిఫికేషన్ విడుదలపై తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులు విద్యాశాఖపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 6నే నోటిఫికేషన్ ఇచ్చిన విద్యాశాఖ బయట పెట్టకుండా జాప్యం చేసింది. రెండు రోజుల తర్వాత తీరిగ్గా విద్యాశాఖ అధికారులు నోటిఫికషన్‌ను బయటపెట్టారు. టీచర్ నియామక నోటిఫికేషన్ విడుదల లోనూ విద్యాశాఖ అధికారుల మొద్దు నిద్రపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు ఎలాగూ సవ్యంగా నిర్వహించడం చేతకాదు కనీసం నోటిఫికేషన్ అయినా సకాలంలో ఇవ్వలేరా అంటూ నిరుద్యోగులు మండిపడుతున్నారు. మరికొందరేమో నోటిఫికేషన్ విడుదల చేయడానికే బద్దకించారు.. వీళ్ళా ఎగ్జామ్ నిర్వహణ చేసేది అంటూ ఫైర్ అయ్యారు.కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 5,089 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆగస్టు 24 ప్రకటించిన విషయం తెలిసిందే. మొత్తం పోస్టుల్లో 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు, 1739 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 611 భాషా పండితులు పోస్టులు, 164 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులున్నాయి. వీటన్నింటినీ డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. బీఈడీ, డీఈడీ, బీపీఈడీలో ఉత్తీర్ణత పొందినవారు ఎవరైనా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే టెట్ పరీక్షలోనూ అర్హత సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏండ్ల లోపు ఉండాలి.ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో అక్టోబర్ 21, 2023వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు కింద ప్రతిఒక్కరూ రూ.1000 చెల్లించాలి.

# రాజ్‌భవన్‌కు- ప్రగతిభవన్‌కు ఎలాంటి గ్యాప్ లేదు

(మొదటిపేజీ తరువాయి)
ప్రగతిభవన్‌కు ఎలాంటి గ్యాప్ లేదన్నారామె. ఇక ఆర్టీసీ బిల్లుపై అనవసర రాద్ధాంతం జరిగిందన్న తమిళిసై తాను కార్మికుల లబ్ధి కోసమే బిల్లుపై ప్రశ్నించానని గుర్తు చేశారు. ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అనేది కేటగిరి ఉంటుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కేటగిరిపై, ప్రభుత్వం పూర్తిగా స్పష్టత ఇవ్వలేదు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అనేది పొలిటికల్ నామినేషన్ కాదు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ కి అర్హత ఉంది అని అనిపిస్తే.. సంతకం చేయడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. రాజ్ భవన్‌కు ప్రగతి భవన్‌కు ఎలాంటి గ్యాప్ లేదు. గ్యాప్ అనేది నేను ఎప్పుడూ ఆలోచన చేయలేద'ని చెప్పుకొచ్చారు.రాజ్యాంగ పరిరక్షరాలిగా తన బాధ్యతలను నిర్వహిస్తానని గవర్నర్ స్పష్టం చేశారు. ప్రజల విజయమే తన విజయంగా ఆమె పేర్కొన్నారు. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్టుగా తమిళిసై సౌందరరాజన్ గుర్తు చేసుకున్నారు. తనపై తెలంగాణ ప్రజలు చూపిన అభిమానానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ తొలి మహిళా గవర్నర్ గా పనిచేయడం తనకు సంతోషంగా ఉందని గవర్నర్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.తాను ఎక్కడ ఉన్నా తెలంగాణతో బంధం మరిచిపోనని.. సవాళ్లకు, పంతాలకు భయపడే వ్యక్తిని కానని గవర్నర్ తెలిపారు. బాధ్యతలు, విధులను సమర్థవంతగా నిర్వర్తిస్తూ.. తెలంగాణలో గవర్నర్‌గా నాలుగేళ్ల కాలం పూర్తి చేసుకున్నానని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కోర్టు కేసులకు, విమర్శలకు భయపడబోనన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనతో తనను కట్టడి చేయలేరని తెలంగాణ ప్రజలకు సేవ చేయడానికి వచ్చా... ప్రజల విజయమే విజయమని తమిళిసై వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వంతో వివాదం పెట్టుకునే ఉద్దేశం.. కొట్లాడే ఉద్దేశం లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సీనియర్ లీడర్.. పవర్ ఫుల్ నేత. నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన నేను చూస్తున్నా. రాజ్‌భవన్‌కి, ప్రగతి భవన్‌కు గ్యాప్ లేదు. సీఎంతో ఎలాంటి దూరం లేదు. దూరం గురించి నేను పట్టించుకోను... తన దారి తనదేనన్నారు. ప్రజలకు ఎంతో సేవ చేయాలని ఉంది కానీ గవర్నర్ ఆఫీస్‌కు కొంత లిమిట్ ఉందని తమిళిశై గుర్తు చేశారు. నిధుల కొరత కూడా ఉందన్నారు. ప్రజలకు సేవ చేయడం తప్ప..పొలిటికల్ ఎజెండా లేదన్నారు. తనది మోసం చేసే తత్వం కాదని స్పష్టం చేశారు. తెలంగాణ బర్త్ డే- నా బర్త్ డే ఒకేరోజు. నా మైండ్ లో ఎప్పుడూ ప్రజలకు సేవ చేయాలనే ఉంటుందన్నారు. తాను నిరంతరం సంతోషంగా ఉండే వ్యక్తినన్నారు. పుదుచ్చేరికి కూడా గవర్నర్ గా ఉన్నా.. తెలంగాణ ప్రజల కోసం ఎక్కువ టైం స్పెండ్ చేస్తున్నా. అడ్మిస్ట్రేషన్ పరంగా రెండు రాష్ట్రాలకూ నా బాధ్యత నిర్వర్తిస్తున్నా. ఇక్కడ జిల్లాలకు వెళ్తే ఐఏఎస్ అధికారులు రారు. కానీ, పుదుచ్చేరిలో సీఎస్ సహా చాలా మందిని పర్యవేక్షిస్తున్నాను. నాకు గౌరవం ఇస్తారా.. నా పనిని గుర్తిస్తారా? అనేది నాకు అవసరం లేదని స్పష్టం చేశారు. ఇక తెలంగాణ పుట్టిన రోజు, తన పుట్టిన రోజు ఒకే రోజున్న గవర్నర్ తన మనసులో ప్రజలకు సేవ చేయాలనే భావనే ఉంటుందన్నారు. తన కుటుంబ నేపథ్యం అంతా రాజకీయాలే అన్న తమిళిసై.. తాను గౌరవం కోసం కొట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. తాను నిత్యం సంతోషంగా ఉండాలని కోరుకునే వ్యక్తినని ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను పుదుచ్చేరి గవర్నర్‌గా సేవలందిస్తున్నా తెలంగాణకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. రెండు రాష్ట్రాలకు తన బాధ్యతను నిర్వర్తిస్తున్నా.. తెలంగాణలో జిల్లాలకు వెళ్తే అధికారులు రారని సంచలన వ్యాఖ్యలు చేశారు. కానీ పుదుచ్చేరిలో మాత్రం సీఎస్ సహా చాలా మందిని పర్యవేక్షిస్తానని చెప్పుకొచ్చారు మరి గవర్నర్ చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి సంచలనం రేపుతాయో చూడాలి.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

# అవకతవకలకు అధికారులే బాధ్యులు

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు :
డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగితే పూర్తిస్థాయి బాధ్యత అధికారులదే అని మంత్రి కేటీఆర్ అన్నారు. తప్పు చేసిన అధికారులను ప్రభుత్వ ఉద్యోగం నుంచి తీసి వేసే స్థాయిలో కఠిన చర్యలు ఉంటాయని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. ఈ మొత్తం ప్రక్రియలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసారు. ఎక్కడా తప్పు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లదే అన్నారు. ఇండ్ల ఎంపికలో ఏదైనా ఇబ్బందులు జరిగితే వాటిని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో గృహలక్ష్మి పథకం కూడా త్వరలో ప్రారంభమవుతుందన్నారు. హైదరాబాద్ నగరంలో గృహలక్ష్మి కార్యక్రమానికి కొన్ని మార్పు చేర్పులు చేయాలని మంత్రులు ముఖ్యమంత్రిని కోరామన్నారు. వారు సూచించిన మార్పులకు ముఖ్యమంత్రి సూచనప్రాయంగా అంగీకరించారని తెలిపారు. హైదరాబాద్ నగరంలో నోటరీ ప్రాపర్టీల అంశంలోనూ త్వరలో పూర్తి మార్గదర్శకాలు వస్తాయన్నారు. 58, 59 జీవోల ద్వారా కూడా పెద్ద ఎత్తున ప్రజలకు ఉపశమనం లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ రకాల కార్యక్రమాల ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణం, పట్టాల రెగ్యులరైజేషన్, నోటరీ ఆస్తుల అంశం వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి నియోజకవర్గానికి కనీసం 15 నుంచి 20వేల మందికి లబ్ధి కలిగిందన్నారు. మూసి పరివాహక ప్రాంతంలో ఉన్న కబ్జాలను తొలగించి, వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం. ఈ కార్యక్రమాన్ని కూడా వేగంగా ముందుకు తీసుకువెళ్తామని కేటీఆర్ అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం భారతదేశంలో ఎక్కడ లేదని అన్నారు. 560 చదరపు అడుగుల విస్తీర్ణంలో పక్కా ఇల్లు నిర్మాణం చేసి ఇచ్చే కార్యక్రమం దేశంలోని ఏ రాష్ట్రంలో లేదని తెలిపారు. హైదరాబాద్ నగరం ఒక్కొక్క 50 లక్షల విలువైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదల కోసం ఉచితంగా అందిస్తున్నామన్నారు. హైదరాబాద్లో నిర్మాణం చేస్తున్న లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం విలువ 9100 కోట్లు ఉందని తెలిపారు. ప్రభుత్వానికి అయిన ఖర్చు 9100 కోట్లు, కానీ వాటి మార్కెట్ విలువ దాదాపు 50 వేల కోట్ల రూపాయలు పైనే



అన్నారు. హైదరాబాద్ నగరంలోని పేద ప్రజలకు సుమారు 50,000 కోట్ల రూపాయలకు పైగా విలువైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం మాదే అన్నారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని జిహెచ్ఎంసి అధికారులు కష్టపడి పూర్తి చేస్తున్నారు, వారికి అభినందనలు అని తెలిపారు. మొదటి దశ 11,700 వేల ఇండ్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పేదలకు అందించామన్నారు. ఈనెల 21వ తేదీన రెండవ దశ దాదాపు మరో 13,300 ఇండ్లను మరోసారి అందించనున్నామని తెలిపారు. అత్యంత పారదర్శకంగా అర్హులైన పేదలకు మాత్రమే అందిస్తున్నామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో ఎవరి ప్రమేయం లేదని అన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికను పూర్తిస్థాయి బాధ్యత అధికారులకే అప్పగించిందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరి వివరాలతో కంప్యూటర్ ఆధారిత డ్రా తీస్తున్నామని, లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా మీడియా ముందు నిర్వహిస్తున్నామన్నారు.

# ఆస్ట్రేలియాలో డిప్యూటీ మేయర్ గా తెలంగాణ మహిళ

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు :
ఆస్ట్రేలియాలో డిప్యూటీ మేయర్‌గా తెలంగాణ మహిళ ఎన్నికయ్యారు. ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్‌లోని సిడ్నీలోని స్ట్రాత్‌ఫీల్డ్ మున్సిపాలిటీకి డిప్యూటీ మేయర్‌గా కర్రి సంధ్యారెడ్డి అనే మహిళ ఎన్నికయ్యారు. ఆస్ట్రేలియాలో డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి భారత సంతతి మహిళగా సంధ్యారెడ్డి గుర్తింపు పొందారు. సంధ్యారెడ్డి తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌కు చెందినవారు. సంధ్యా రెడ్డి హైదరాబాద్‌లోని స్టాన్లీ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివాడు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఏం పూర్తి చేశారు? 1991లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన కర్రి బుచ్చిరెడ్డితో సంధ్యా రెడ్డి వివాహం జరిగింది. తల్లిదండ్రులు పాథోళ్ల సారారెడ్డి, శంకర్‌రెడ్డి. పెళ్లి తర్వాత భర్తతో కలిసి ఆస్ట్రేలియా వెళ్లింది. అక్కడే చదువు కొనసాగించాడు. ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ నుండి మైగ్రేషన్ లాలో డిగ్రీ. చదువు పూర్తయ్యాక ఇమ్మిగ్రేషన్ లాయర్‌గా పనిచేశారు. ఆస్ట్రేలియాకు చెందిన ఆమె తన భర్తతో కలిసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసింది.స్ట్రాత్‌ఫీల్డ్‌లోని హోమ్ బుష్ కమ్యూనిటీ సెంటర్‌లో భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో సంధ్యా రెడ్డి గొప్ప చొరవ చూపారు. 2020లో, ఆమె సేవలకు గానూ సిటిజన్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో గుర్తింపు పొందింది. సంధ్యా రెడ్డి స్ట్రాత్‌ఫీల్డ్‌లో ఉంటారు. స్ట్రాత్‌ఫీల్డ్‌లో 2021లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి.అప్పట్లో సంధ్యారెడ్డి చురుకుదనం, సేవా కార్యక్రమాలను స్థానిక తెలుగు వారు.. ప్రవాస భారతీయులు? ఆస్ట్రేలియన్లు కూడా ఆమెను పోటీ చేయమని కోరారు. దీంతో ఆమె స్థానిక లేబర్ పార్టీ, లిబరల్ పార్టీ అభ్యర్థులపై స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి.. ఎన్నికల్లో విజయం సాధించారు. స్ట్రాత్‌ఫీల్డ్ మునిసిపాలిటీకి ప్రతి ఏడు మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉంటుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో డిప్యూటీ మేయర్‌గా సంధ్యారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ అవకాశం రావడం పట్ల సంధ్యారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. సంధ్యా రెడ్డికి నీల్ రెడ్డి, నిఖిల్ రెడ్డి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో నిఖిల్ ఆస్ట్రేలియా జాతీయ చెస్ ఛాంపియన్‌గా ఈ ఏడుగురిని గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియాలో తెలంగాణ మహిళా శక్తిని చాటిచెప్పిన సంధ్యారెడ్డికి బీఆర్ఎస్ ప్రవాస విభాగం కోఆర్డినేటర్ బిగాల మహేశ్, ఇతర నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్ట్రాత్‌ఫీల్డ్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనందుకు ఆమెను అభినందించారు. తెలుగు రాష్ట్రాలకే గర్వకారణమని ఆమె అన్నారు.

# హోంగార్డు మృతి

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు :
ఆత్మహత్యాయత్నం చేసుకొని అపోలో డీఆర్డీఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు రవీందర్ ఈ ఉదయం మృతి చెందారు. 70శాతానికి పైగా కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవీందర్.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. అయితే ఉన్నతాధికారుల వేధింపులు వల్లే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు మరణ వాంగ్మూలం కూడా ఇచ్చారు. ఈక్రమంలోనే పోస్టుమార్టం నిమిత్తం రవీందర్ మృతదేహాన్ని ఉస్మానియా మోర్చరీకి తరలించారు. హోమ్ గార్డు రవీందర్ మృతితో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హోమ్ గార్డులకు అధికారుల వార్నింగ్ ఇచ్చారు. హోమ్ గార్డులు అందరూ డ్యూటీలో తప్పనిసరిగా ఉండాలని సూచించారు. డ్యూటీ లో లేని హోమ్ గార్డులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ లోనే ఉండాలని చెప్పారు. వీరంతా అందుబాటులో ఉండేలా ఇన్స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని.. లా అండ్ ఆర్డర్ లో పనిచేసే వారు సమ్మెకు పూనుకుంటే విధుల నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. హోంగార్డు రవీందర్ చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. గత రెండు నెలల నుంచి రవీందర్‌కు జీతాలు రావడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడడంతో పలుమార్లు ఉన్నతాధికారులను కలిసి జీతం గురించి, ఆర్థిక పరిస్థితి గురించి వివరించాడు.

భళా భారత్...

# ప్రశంసించిన వరల్డ్ బ్యాంక్

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

భారత్‌లోని డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని ప్రపంచ బ్యాంక్ ప్రశంసించింది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా 47 ఏళ్లలో సాధించాల్సింది కేవలం ఆరేళ్లలనో సాధించారని కితాబునిచ్చింది. దీనిపై ఓ నివేదికను కూడా విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో జరిగిన విలువ దేశ జీడీపీలో 50% మేర ఉన్నట్టు ఈ రిపోర్ట్ స్పష్టం చేసింది. బ్యాంక్‌లు కస్టమర్స్ కోసం పెట్టే ఖర్చు కూడా భారీగా తగ్గిందని వెల్లడించింది. 23 డాలర్ల నుంచి 0.1 డాలర్లకు పడిపోయిందని నివేదించింది. ఇదంతా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వల్లే అని తేల్చి చెప్పింది. 2022 మార్చి నాటికి భారత్ 33 బిలియన్ డాలర్ల మేర సేవింగ్స్ చేసుకోగలిగిందని, ఇది జీడీపీ లో 1.14%తో సమానమని వివరించింది. ఇది డీబీటీ ద్వారానే ఇది సాధ్యమైందని స్పష్టం చేసింది. ఓ డాక్యుమెంట్‌ని తయారు చేసింది ప్రపంచ బ్యాంక్. భారత ఆర్థిక శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన లెక్కల ప్రకారం ఈ డాక్యుమెంట్‌ని రూపొందించింది. ఉ20 సదస్సులో డిజిటల్ భారత్ నినాదాన్ని గట్టిగా వినిపించాలనుకుంటున్న భారత్‌కి ఈ నివేదిక మరింత జోష్ ఇచ్చింది. ఇదే విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. 47ఏళ్లలో సాధించాల్సింది కేవలం ఆరేళ్లలోనే సాధించామంటూ ప్రపంచ బ్యాంక్ నివేదించిందని వెల్లడించారు. "కేవలం ఆరేళ్లలో 80% మేర డిజిటల్ లావాదేవీలు జరిగే స్థాయికి భారత్ చేరుకుంది. ఈ ఘనత సాధించాలంటే కనీసం 5 దశాబ్దాలు పడుతుంది. కానీ...ఇండియా మాత్రం ఆరేళ్లలోనే సాధించింది. ఇదంతా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వల్లే. ఆధార్, జన్‌ధన్ బ్యాంక్‌తో పాటు మొబైల్ ఫోన్స్ కూడా ఈ ఘనత సాధించడంలో ఎంతో తోడ్పడ్డాయి. పీఎంజేడివై ఖాతాల సంఖ్య 2022 నాటికి 46.2 కోట్లకు పెరిగింది. ఇందులో మహిళలకే 56% మేర అకౌంట్‌లున్నాయి. ఐడెంటిటీ వెరిఫికేషన్ కోసం ఆధార్‌ని తప్పనిసరి చేయడమూ కలిసొచ్చింది. యూపిఐకి భారత దేశ ప్రజలు చాలా తొందరగా అలవాటు పడ్డారని ప్రపంచబ్యాంక్ నివేదిక స్పష్టం చేసింది.

# ఉస్మానియా వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో ఉస్మానియా ఆస్పత్రి దగ్గర ఉద్రిక్తత నెలకొంది. ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన హోంగార్డు రవీందర్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో ఉంచారు. కాసేపట్లో రవీందర్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మరోవైపు.. హోంగార్డు రవీందర్ భార్య సంధ్య.. తన పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. తన భర్తను ఆత్మహత్య కాదని.. ఉన్నతాధికారులు చేసిన హత్య అని ఆరోపిస్తున్నారు ఆమె. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వేధించి, ఆత్మహత్య చేసుకునేలా చేశారంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. తన భర్త ఫోన్‌ను తీసుకున్న పోలీసులు.. అందులోని డాటా మొత్తం డిలీట్ చేశారు సంధ్య చెప్తున్నారు. తన భర్త రవీందర్ మృతికి... ఏఎస్సై నర్సింగ్‌రావు, కానిస్టేబుల్ చందునే కారణమని ఆరోపిస్తున్నారు సంధ్య. వారిని వెంటనే అరెస్ట్ చేయాలని.. అసలు ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదని ఆమె ప్రశ్నించారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో హోంగార్డ్ ఆఫీసర్ హైమద్ పాత్ర కూడా ఉందని ఆరోపిస్తున్నారు. ప్రీప్లాన్డ్‌గా తన భర్తను చంపారని అంటున్నారామె. రవీందర్ కుమారుడు కూడా తన తండ్రి మృతికి ఏఎస్సై నర్సింగ్‌రావు, కానిస్టేబుల్ చందూనే కారణమని చెప్తున్నాడు. మరోవైపు హోంగార్డు రవీందర్ మృతికి నిరసనగా.. హోంగార్డుల జేఏసీ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఆయన కుటుంబానికి మద్దతుగా నిలవాలని నిర్ణయించింది. హోంగార్డులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేయబోతున్నారు. రవీందర్ మృతదేహంతో సచివాలయానికి వెళ్లాలని కూడా ప్లాన్ చేస్తున్నారు. కుటుంబసభ్యుల ఆందోళనతో ఉస్మానియా ఆస్పత్రి దగ్గర ఉద్రిక్తత కనిపిస్తోంది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉస్మానియా ఆస్పత్రి దగ్గర భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు హోంగార్డులు ఆందోళనకు దిగకుండా... ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. హోంగార్డులు అందరూ విధుల్లోనే ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. విధులకు హాజరుకాకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అంతేకాదు.. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల బాధ్యతలను ఎస్సైలకు అప్పగించారు. హోంగార్డులు అందరూ విధులకు హాజరయ్యేలా చూడాలని హుకుం జారీ చేశారు. విధులు కేటాయించని వారంతా పోలీస్ స్టేషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కేసీఆర్ మాటలకు చేతలకు పొంతన వుండదు

నల్గొండ- ప్రభాత సూర్యుడు: నల్గొండ జిల్లా దేవరకొండ సాయి రమ్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన బీజేపీ బూత్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈటెల మాట్లాడుతూ పదిలక్షల దళిత గిరిజన బంధు ఇస్తానని కేసీఆర్ చెప్పి మోసం చేసారని వేదిక మీదకి వచ్చిన ఇద్దరు మహిళలు చెప్పారు. కేసీఆర్ మాటలకు చేతలకు పొంతన ఉండదు. దళితులు, గిరిజనులు, ప్రజలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కేసీఆర్ కి గుర్తుకు వస్తారు.. అసెంబ్లీ లో సమస్యలపై ప్రశ్నిస్తే స్పీకర్ మైకు బంద్ చేస్తాడు,కేసీఆర్ తన మాటలతో దాటేస్తారు. మారుమూల,చీకటి ప్రాంతంలో ఉన్న ప్రజలు సొంతిటి కల తో నమ్మి ఓట్లేశారు,కానీ హైద్రాబాద్ లో కూడా సరిగ్గా డబల్ బెడ్రూమ్ ఇవ్వలేదు. పక్క రాష్ట్రంలో కట్టినన్ని ఇళ్ళు కూడా మన రాష్ట్రంలో కట్టకుండా మోసం చేసాడు. దేవరకొండ ప్రాంతానికి చెందిన చందంపేట మండలంలోని చిన్నారిని హైదరాబాద్ లో ఉన్న నందనవనం కాలనీ లో ఆరుగురు చేరిచిన ఘటన చూస్తుంటే, మరొకరు లక్ష్మి అనే మహిళ అన్న ఇంటికి పోయి వస్తుంటే ఎల్బీ నగర్ లో పోలీసులు అపి తమ వాహనం లో తిప్పి తిప్పి కొట్టి చిత్ర హింసలు పాలు చేసిన సంగతి చూస్తుంటే మహిళ కు రక్షణ ఎక్కడుందనిపిస్తోంది. పొట్ట చేత పట్టుకొని హైద్రాబాద్ కు కూలి కోసం వెళ్లిన వారికి తమ ప్రభుత్వం ఏమైనా సాయం చేసిందా. వృద్దులకు, వితంతువులు పింఛన్లు ఇవ్వకుండా తన దగ్గరే తాళం వేసుకొని హైద్రాబాద్ లో కూర్చున్నాడు,దమ్ముంటే కేసీఆర్ పింఛన్లు అందచేసి ఎన్నికలకు రావాలి. నిరుద్యోగ భృతి విషయంలో ఓట్ల కోసం వచ్చే వారిని ప్రశ్నించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకొని ఎన్నికలకు వస్తారు.గిరిజన ప్రాంతాల్లో గుడుంబా అరికట్టాలని కేసీఆర్ పిలుపు ఇస్తే సంతోషంతో అందరూ సహకరిస్తే ఆ స్థానాల్లో కేసీఆర్ మద్యం పెట్టి 45 వేల కోట్ల సొమ్ము చేసుకుంటున్నారు. మీ ముందుకు వస్తారు ఇచ్చిన డబ్బులు తీసుకొని ఓటు మాత్రం ధర్మానికి వేయండి.కేసీఆర్ ని ఓడగొట్టాలని అయన పిలుపునిచ్చారు.

# జీ 20 అతిధులకు మిల్లెట్స్ వంటకాలు

## బంగారు, వెండి పాత్రల్లో భోజనం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

జీ20 సదస్సుకు వచ్చే అతిథులకు అదిరిపోయే ఆతిథ్యం ఇవ్వబోతున్నట్లు ప్రత్యేక కార్యదర్శి ముక్తేశ్ పరదేశి తెలిపారు. స్థానిక వంటకాలతో పసందుగా విందు ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు చిరు ధాన్యాలతో కూడిన భారతీయ వంటకాల రుచి చూపిస్తామని చెప్పారు. అలాగే చిరు ధాన్యాల పౌడర్ తో ఫ్రూట్ సలాడ్లు, బెల్లం రాగి ఖీర్, స్పెషల్ మిల్లెట్ థాలి, మిల్లెట్ పలావ్, మిల్లెట్ ఇండ్లీ వంటి వంటకాలు చేయబోతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా రాజస్థానీ దాల్ బాటీ ఖుర్మా, పశ్చిమ బెంగాల్ రసగుల్లా, దక్షిణాది మసాలా దోశ బిహార్ లిట్టీ చోకాలనూ అతిథిలకు వండి వడ్డించబోతున్నట్లు స్పష్టం చేశారు. అలాగే చాందినీ చౌక్ వంటకాలను కూడా తినిపిస్తామని స్పష్టం చేశారు. భారత్ సెప్టెంబరు 9, 10 తేదీల్లో జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరిగే సమ్మిట్‌కు ప్రపంచ స్థాయి నాయకులు, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. అందు కోసం ఢిల్లీలోని హోటళ్లు ప్రత్యేకమైన రీతిలో వివిఐపి లకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధమవుతున్నాయి. దేశాధినేతలు, ఇతర ప్రపంచ నాయకులకు వెండి, బంగారు పూత పూసిన పాత్రల్లో భోజనం అందించనున్నారు. భారతదేశం సంస్కృతి, ప్రతిబింబించేలా వెండి, బంగారు పూత పూసిన పాత్రల్లో భోజనం, ఆతిథ్యం అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అతిథులకు విలాసవంతమైన విందు కోసం వివిధ లగ్జరీ హోటళ్లలో ఈ వస్తువులను ఏర్పాటు చేశారు. అత్యంత ఆకర్షణీయమైన, అందమైన పాత్రలను ఐకానిక్ ఎఅ తాజ్ హోటల్‌తో సహా 11 హోటళ్లకు పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందు కోసం క్రోకరీ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భగా పాత్రల తయారీ సంస్థ యజమానులు రాజీవ్, అతని కుమారుడు మాట్లాడుతూ.. తాము మూడు తరాలుగా ఈ పాత్రలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. విదేశీ సందర్శకులకు తమ డైనింగ్ టేబుల్‌లపై భారతదేశ రుచిని అందించడమే తమ లక్ష్యం అని చెప్పారు. ఈ పాత్రలు జైపూర్, ఉదయపూర్, వారణాసి, కర్నాటకలో కళాత్మకంగా రూపొందించినట్లు చెప్పారు. ఇవి భారతదేశంలోని విభిన్న సంస్కృతులను ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ పాత్రలపై మేక్ ఇన్ ఇండియా అని ఉంటుంది. ఇవి దేశంలోని హస్తకళకు ప్రతిరూపంగా నిలుస్తాయి. ఐరిస్ కంపెనీ ప్రకారం, జీ20 సమ్మిట్ కోసం 11 హోటళ్లకు ప్రత్యేకమైన పాత్రలను పంపుతున్నారు. ఈ పాత్రలు తయారైన తరువాత ప్రతి భాగం ఖీడఆ ల్యాబ్‌లో క్షుణ్ణంగా పరీక్షించారు. హోటళ్ల నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా ఈ పాత్రలు రూపొందించబడ్డాయి.

'మహారాజా తాలీ' తరహాలో ఉప్పు, పెప్పర్ కోసం ప్రత్యేక వెండి గిన్నెలు, అన్నీ హోటల్ మెనూ, శైలికి సరిపోయేలా 5-6 గిన్నెలను కలిగి ఉండేలా పాత్రల సెట్లు రూపొందించబడ్డాయి. ఈ పాత్రల సెట్లు భారతదేశం గొప్ప వారసత్వానికి ప్రతీకగా నిలవనున్నాయి. జాతీయ పక్షి నెమలిని కూడా కంపెనీ తన డిజైన్‌లో చేర్చింది. ఇది తరచుగా అతిథుల నుంచి ప్రశంసలను పొందుతుంది. మహారాజా తాలీతో పాటు, దక్షిణ భారతదేశానికి చెందిన డిజైన్‌లను కూడా సేకరణలో పొందుపరిచారు. వివిధ హోటళ్లు వారి ప్రత్యేకమైన మెనుల ఆధారంగా తమ పాత్రల డిజైన్‌లను రూపొందించారు. ఇలా ప్రత్యేకంగా తయారు చేయడానికి చాల సమయం పడుతుందని తయారీదారులు తెలిపారు.

# మళ్లీ పవర్ పాలిటిక్స్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో అధికార ప్రతిపక్ష పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఏ చిన్న అవకాశం దొరికినా వదలకుండా ఒకరిపై ఒకరు తీవ్ర వ్యాఖ్యలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఉచిత విద్యుత్ టాపిక్ మళ్లీ తెరమీదకొచ్చేసింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ఓ రేంజ్ లో వార్ నడుస్తోంది. సై అంటే సై అంటున్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాజకీయం వేడెక్కింది. రాష్ట్ర విభజన జరిగితే తెలంగాణా చీకటిమయం అవుతుందన్న కిరణ్‌కుమార్‌రెడ్డి మాటల్ని గుర్తు చేశారు మంత్రి ఎర్రబెల్లి. ఉచిత కరెంట్ ఇస్తే తీగల మీద బట్టలు ఆరేసుకోవాలన్నారని.. ఇప్పుడా పరిస్థితి ఏపీలో ఉందని రివర్స్ కౌంటరిచ్చారు. బాబు, కిరణ్ వ్యాఖ్యల్నిగుర్తు చేసిన ఎర్రబెల్లి.. అప్పట్లో ఎగతాళి చేసినవాళ్లే నోరెళ్లబెట్టేశారన్నారు. ఇప్పుడు తెలంగాణ రూపు మారిందని.. ఏపీలోనే కరెంట్ కోతలు ఎక్కువంటూ ఎర్రబెల్లి దయాకర్ రావు వ్యాఖ్యానించారు.తొర్రూరు లయన్స్ క్లబ్ ? వాసవి క్లబ్ అధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ, పాత్రికేయ దినోత్సవాల్లో పాల్గొన్నారు ఎర్రబెల్లి. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రెండురాష్ట్రాల్లోనూ చర్చనీయాంశం అయ్యాయి. ఇటు? మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ కూడా ఉచిత కరెంట్ సబ్జెక్ట్‌ని తిరగదోడేశారు. తెలంగాణాలో 24 గంటల ఫ్రీపవర్ ఇస్తున్నారని రుజువు చేయగలరా అని బీఆర్ఎస్‌కి బహిరంగ సవాల్ విసిరారు ఈటల. ఉచిత కరెంట్‌పై చర్చకు రావాలని, ఒకవేళ రాకపోతే తప్పుడు ప్రచారం మానుకోవాలని అధికార పార్టీపై ఎటాక్ చేశారు ఈటల. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా ఇస్తున్నట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఛాలేంజ్ చేశారు ఈటల రాజేందర్.బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఈటల రాజేందర్ మరోసారి ఉచిత కరెంట్ అంశాన్ని లేవనెత్తడాన్ని నిశితంగా గమనిస్తున్నాయి రాజకీయవర్గాలు. మరోవైపు రైతుల సమస్యలపై కేసీఆర్‌ను టార్గెట్ చేసిన రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వ్యంగ్యంగా ట్వీట్ చేస్తూ కేసీఆర్ హామీలను ఎండగట్టారు. అనగనగా ఓ కేసీఆర్ అంటూ మొదలుపెట్టి కథలు కంచికి- కేసీఆర్ ఫాంహౌస్ కి అంటూ ముగించారు. వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్.. 150 ఎకరాల్లో వేశారని ఎద్దేవా చేశారు. రైతులకు ఫ్రీ ఎరువులు అని.. వారిని గంటల తరబడి క్యూలో నిలబెట్టాడని విమర్శించారు. 24 గంటల కరెంట్ అన్నారు? లాగ్ బుక్ చూస్తే పట్టుమని పది గంటలు లేదని మండిపడ్డారు రేవంత్ రెడ్డి.

# రష్యా- ఉక్రెయిన్ యుద్ధం

## భారత్ తీరు సముచితం- మన్మోహన్ సింగ్

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఉక్రెయిన్, రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధం విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ స్పందించిన తీరే కరెక్ట్ అని మాజీ ప్రధాన మంత్రి, కాంగ్రెస్ నేత మన్మోహన్ సింగ్ పేర్కొన్నారు. భారత్ ప్రదర్శించిన వైఖరిని సరైనదే అని ఆయన మోదీని సమర్థించారు. దేశ సార్వభౌమత్వం, ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చి సరైన విధంగా స్పందిచారని, మీరు చేసిందే కరెక్ట్ అని అన్నారు. అదే సమయంలో శాంతి స్థాపన కోసం విజ్ఞప్తి చేయడాన్ని కూడా ఆయన సమర్థించారు. మన్మోహన్ సింగ్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో జీ 20 సదస్సు జరుగుతున్న నేపథ్యంలో మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. మన్మోహన్ సింగ్ యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు ప్రధానమంత్రిగా పనిచేశారు. శనివారం జరిగే జీ 20 విందుకు మన్మోహన్‌కు కూడా ఆహ్వానం అందింది.ప్రస్తుతం దేశీయ రాజకీయాలకు కూడా విదేశీ పాలసీల ప్రాముఖ్యత చాలా పెరిగిందని, తన హయాంలో ఇలా లేదని మన్మోహన్ పేర్కొన్నారు. అయితే పార్టీ రాజకీయాల కోసం దౌత్య పరమైన అంశాలను ఉపయోగించుకోవడంలో సంయమనం పాటించాలని అన్నారు. భారత్ జీ 20 సదస్సుకు అధ్యక్షత వహించడం పట్ల మన్మోహన్ సంతోషం వ్యక్తంచేశారు. తన జీవిత కాలంలో భారత్‌కు జీ20 సమావేశాలకు అధ్యక్షత వహించే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. జీ 20 నేతలకు భారత్ ఆతిథ్యమివ్వడాన్ని తాను చూస్తున్నానని అని సంతోషం వ్యక్తంచేశారు. అలాగే రష్యా-ఉక్రెయిన్ సంక్షోభంపై మాట్లాడుతూ భారత్ ఈ అంశాన్ని డీల్ చేసిన విధానం కరెక్ట్ అని అభిప్రాయపడ్డారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ దేశాల మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు ఏదో ఒక దానికి మద్దతుగా నిలవడం ఇతర దేశాలకు కష్టమైన విషయమని అన్నారు. ఈ విషయంలో దేశ సార్వభౌమత్వం, ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ భారత్ ఎంచుకున్న వైఖరి సరైనదని మన్మోహన్ పేర్కొన్నారు. అయితే జీ 20 సదస్సులో పలు దేశాలు భద్రతపరమైన విభేదాలను పక్కన పెట్టి వాతావరణ మార్పులు, అసమానతలు, అంతర్జాతీయ వాణిజ్యంలో విశ్వాసం కలిగేలా ఈ వేదికపై చర్చల విషయంలో దృష్టి పెట్టడం ముఖ్యమంని ఆయన అభిప్రాయపడ్డారు. భద్రతా పరమైన విభేదాలను పరిష్కరించే వేదికగా జీ20ని ఎన్నడూ పరిగణించలేదని అన్నారు.చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సదస్సుకు హాజరుకాకపోవడంపైనా మన్మోహన్ స్పదించారు. భారతదేశ ప్రాదేశికత, సార్వభౌమత్వాన్ని కాపాడడానికి అవసరమైన అన్ని చర్యలను ప్రధాని నరేంద్ర మోదీ తీసుకుంటారని తాను ఆశిస్తున్నానని, ప్రభుత్వానికి సలహా ఇవ్వడాన్ని తాను ఇష్టపడడం లేదని అన్నారు. క్లిష్టమైన దౌత్య వ్యవహారాలను ఎలా నిర్వహించాలో ప్రధానమంత్రి తాను సలహా ఇవ్వడం సరికాదని అన్నారు.

# యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్ల ఆందోళన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ సంఘం ఆద్వర్యంలో కాంట్రాక్ట్ టీచర్లు అందోళనకు దిగారు. రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిజాం కాలేజ్ లో ఆందోళన చేసారు. గన్ పార్క్ వద్దకు ర్యాలీగా వెళ్లిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేసారు. 12 యూనివర్సిటీ లలో పెన్ డౌన్ లో భాగంగా గన్ వరకు ర్యాలీకి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వాన్ని అనేక రకాలుగా విజ్ఞప్తి చేసినా.. తమను ఎందుకు రెగ్యులరైజ్ చేయడం లేదు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని..అమలు చేయడం లేదు. ఎంతో మందికి పాఠాలు చెప్పాం.. గొప్ప వారు అయ్యారు.. పోలీసులు అయ్యారు ఇపుడు ఆ పోలీసుల చేత మమ్మల్ని అరెస్ట్ చేయిస్తున్నారు. ఇంత దారుణమా.. మాకు న్యాయం చేయాలని వారన్నారు. ఎన్నికల వరకు మా హామిని నెరవేర్చలేదు..ఇంకెప్పుడు చేస్తారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేసారు.

# పరీక్షల్లో చీటి ఇవ్వలేదని దాడి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

సాధారణంగా స్నేహితులు అంటే ఒకరికొకరు సాయం చేసుకుంటారు. ప్రాణ మిత్రులు అయితే ప్రాణ త్యాగాలు కూడా చేసుకుంటారు. మరీ పెద్ద, పెద్ద విషయాలు అయితే తప్ప గొడవ పడరు. ఒకవేళ పడినా మళ్లీ తమను తామే సమాధాన పరుచు కుంటారు. కానీ ఓ ఘటనలో మాత్రం ఇద్దరు స్నేహితులు.. చిన్న దాని కోసమే చితక్కొట్టుకున్నారు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ నగరంలో జరిగింది. పాతబస్తీ పరిధిలో విద్యార్థులు తీవ్రంగా కొట్టుకున్నారు. ఒక విద్యార్థి మరో విద్యార్థిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కింద పడేసి పిడిగుద్దులు కురిపించాడు. ఆ విద్యార్థి దాడికి తాళలేక బాధిత స్టూడెంట్ అక్కడే కుప్పకూలిపోగా.. తోటి విద్యార్థులు అతడిని ఆస్పత్రికి తరలించారు. పాతబస్తీ ఛాదర్‌ఘాట్ పరిధిలో నివాసం ఉండే కసబ్, ఆరిఫ్ అనే విద్యార్థులు ఇద్దరు స్నేహితులు, ఇద్దరూ ఒకే కాలేజీలో చదువుతున్నారు. ఎస్ఐఎస్ వొకేషనల్ జూనియర్ కాలేజీలో ఆరిఫ్, కసబ్ సహ విద్యార్థులు కూడా. ఇద్దరూ మంచి స్నేహితులు. కాగా, ప్రస్తుతం కాలేజీలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలే ఆ ఇద్దరు స్నేహితుల మధ్య కలహానికి దారి తీశాయి. ఆరిఫ్, కసబ్ ఇద్దరూ పరీక్ష రాస్తున్న సమయంలో కసబ్.. ఆరిఫ్ నుంచి చీటి అడిగాడు. అయితే, ఆరిఫ్ చీటి ఇవ్వకపోవడంతో పరీక్ష హాలులోనే కసబ్ కోపంతో ఊగిపోయాడు. పరీక్ష అయిపోయాక నీ సంగతి చూస్తా అనుకున్నాడు. పరీక్ష అయిపోగానే విద్యార్థులు అంతా పార్కింగ్ సెల్లార్ లో కలుసుకున్నారు. ఈ క్రమంలో పరీక్ష సమయంలో తనకు చీటి అందించకపోవడంపై కసబ్.. ఆరిఫ్ ను నిలదీశాడు. ఈ క్రమంలోనే వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. అప్పటికే ఆవేశంతో ఊగిపోతున్న కసబ్.. ఆరిఫ్ పై దాడికి తెగబడ్డాడు. స్నేహితుడు అని కూడా చూడకుండా విచక్షణ రహితంగా కొట్టాడు. ఆరిఫ్ ను బలంగా కింద పడేసి ముఖంపై, తలపై పిడిగుద్దులు కురిపించాడు. కసబ్ దాడికి తాళలేక ఆరిఫ్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటి విద్యార్థులు కసబ్ ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. రక్తమోడుతున్న ఆరిఫ్ ను నడవలేని స్థితిలో అక్కడి నుంచి విద్యార్థులు మోసుకెళ్లారు. స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న ఛాదర్ ఘాట్ పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు.


# జిల్లా ప్రధాన ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**పెద్దపల్లి- ప్రభాత సూర్యుడు :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాని ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలు భాగంగా హాస్పిటల్ లో పేషంట్ల వద్దకు వెళ్లి వారి క్షేమ సమాచారం తెలుసుకున్నారు అనంతరం హాస్పిటల్ కలిగే తిరుగుతూ ప్రజలకు ఏవేవి అందుబాటులో ఉన్నాయో ఇంకా ఏమి కావాలో సూపర్డెంట్ రమాకాంత్ ను అడిగి తెలుసుకున్నారు.అలాగే సూపర్డంట్ మాట్లాడుతూ.. కొన్ని అభివృద్ధి పనులకు ప్రపోజల్ పెట్టమని తెలిపారని,అవి పరిసరాల పరిశుభ్రత కోసం కంపౌండ్ వాల్ ఎత్తు చేయాలని,ప్రజలకు,రోగులకు మంచినీటి సరఫరా కొరకు అర్. ఓ.ప్లాంట్ , ఓపి వద్ద రద్దీగా ఉన్నందున టోకెన్ సిస్టం ఏర్పటు చేసి,ఒక డిస్ప్లే ఏర్పాటు చేస్తే అది చూసి రోగులు నిలబడే పద్దతి లేకుండా పోతుందని,అలాగే ఇక్కడ ఆపరేషన్ లు ఎన్ని జరుగుతున్నవి అని అడిగి తెలుసుకున్నారు,మీరు పంపించే వాటిని యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేపిస్తమని తెలిపారని సూపర్ డెంట్ రమాకాంత్ తెలిపారు..

# తీన్మార్ మల్లన్న కొత్త పార్టీ..?

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలుగు రాష్ట్రాల్లో రెండు కొత్త రాజకీయ పార్టీలు రాబోతున్నాయి. తెలంగాణ ఒకటి, ఏపీలో మరో పార్టీ...కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నాయి. తెలంగాణ నిర్మాణ పార్టీ పేరుతో తీన్మార్ మల్లన్న ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ పేరుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే...ఈ నెల 20లోగా తెలియజేయాలని ఈసీ వెబ్ సైట్ లో తెలియజేసింది. సెక్షన్ 29ఎ పీపుల్స్ రెప్రజంటేషన్ చట్టం ప్రకారం....పార్టీని రిజిస్టర్ చేస్తున్నట్లు ఈసీ ప్రకటించింది. అటు క్రిష్ణ జిల్లా కంచికర్లకు వ్యక్తి...తెలుగు రాజ్యాధికార పార్టీ పేరుతో ఈసీకి దరఖాస్తు చేసుకున్నారు. ఆరు జాతీయ పార్టీలు, తెలంగాణలో నాలుగు గుర్తింపు పార్టీలతో పాటు107 గుర్తింపు లేని పార్టీలు ఉన్నాయి. 70 పార్టీలు ఎన్నికల సంఘంలో రిజిస్టర్ చేసుకున్నాయి. తీన్మార్ మల్లన్న ..కొత్త పార్టీ పెడుతున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. గత ఏప్రిల్ లో పార్టీ పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తీన్మార్ మల్లన్న ప్రకటించారు. త్వరలో తమ పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు లభిస్తుందన్న తీన్మార్ మల్లన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి విద్య, వైద్యంతో పాటు సత్వర న్యాయం కోసం పోరాటం చేసేందుకే పార్టీ పెట్టినట్లు తెలిపారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న మేడ్చల్ నియోజకవర్గంలో బరిలోకి దిగనున్నట్లు తీన్మార్ మల్లన్న తెలిపారు. తెలంగాణ నిర్మాణ పార్టీ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని ప్రకటించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలినా తమకేం సంబంధం లేదన్నారు. తాము కేసీఆర్ కు మాత్రమే వ్యతిరేకమని...ప్రతిపక్ష పార్టీలకు కాదని స్పష్టం చేశారు. తమతో కలిసి పని చేసేందుకు ఏ ప్రతిపక్ష పార్టీ ముందుకు వచ్చినా...స్వాగతిస్తామన్నారు.తీన్మార్ మల్లన్న అసలు పేరు చింతపండు నవీన్ కుమార్. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామంలో...1982, జనవరి 17న జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు. హైదరాబాద్ జెఎన్టీయూ నుంచి 2009లో ఎంబీఏ పూర్తి చేశాడు. ఆ తర్వాత పలు న్యూస్ ఛానెల్స్ లలో పని చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2012లో వి6 ఛానెల్ లో ప్రసారమైన తీన్మార్ వార్తలు ద్వారా నవీన్ కాస్త తీన్మార్ మల్లన్నగా సుపరిచితుడయ్యారు.2015లో నల్గొండ -ఖమ్మం ?వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019లో జరిగిన హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం స్థానానికి జరిగిన ఉపఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2021 మార్చిలో నల్గొండ ?ఖమ్మం?వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. కొంతకాలం పాటు బీజేపీలో పని చేశారు. ప్రస్తుతం క్యూ గ్రూప్ మీడియాను నిర్వహిస్తున్నారు.

# అర్ధరాత్రి ప్రైవేట్ ట్రావెల్ బస్సు దగ్ధం



**మిర్యాలగూడ- ప్రభాత సూర్యుడు :** నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ సమీపంలో కృష్ణాపురం వద్ద రోడ్డుపై అగ్ని ప్రమాదం జరిగింది. గురువారం రాత్రి ఓ ప్రయివేటు బస్సు లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ బస్సు కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ కు చెందినట్లుగా గుర్తించారు. వెనుక టైర్ పేలడంతో ప్రమాదం జరిగినట్టుగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుండి నెల్లూరు వెళున్న సమయంలో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 26మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికుల అప్రమత్తతతో ప్రాణ నష్టం తప్పింది. మంటల ధాటికి బస్సు పూర్తిగా దగ్ధమైంది.

మంత్రి వేముల సమక్షంలో పలువురు

# బిఆర్ఎస్ పార్టీలో చేరిక

**వేల్పూర్- ప్రభాత సూర్యుడు :** సీఎం కేసిఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఏర్గట్ల మండలం తడ్పాకల్ గ్రామానికి చెందిన యాదవ సంఘం సభ్యులు,బీజేపీ,కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు శుక్రవారం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో భారత్ రాష్ట్ర సమితిలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. కేసిఆర్ గారికి,తనకు మద్దతుగా నిలవాలని స్వచ్ఛందంగా వచ్చి పార్టీలో చేరిన వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు అని మంత్రి అన్నారు. మీకు ఎల్ల వేళలా అండగా ఉంటానని, తడ్పాకల్ గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# హోం గార్డు మృతిపట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారం

**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు :** హోంగార్డు రవీందర్ మృతిపట్ల కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విచారం వ్యక్తం చేసారు. రెండ్రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన హోంగార్డు రవీందర్.. చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. రవీందర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఇది ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వం చేసిన హత్యే. హోంగార్డులకు కనీస ఆత్మగౌరవాన్ని కూడా ఇవ్వకుండా.. వేధిస్తున్న బీఆర్ఎస్ సర్కారు తీరును తీవ్రంగా ఖండిస్తున్నాను. ఆత్మహత్యలు చేసుకొవద్దని అన్నారు.

# వివాదమవుతున్న కేయూ పిహెచ్డీ వ్యవహారం

**విద్యార్థి నేతలకు గాయాలు, అందోళన ఉధృతం చేస్తామన్న ఏబీవీపీ**




**వరంగల్ - ప్రభాత సూర్యుడు :** వరంగల్ లో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ విద్యార్థుల ఆందోళన రాజకీయంగా దుమారం రేపుతుంది. పీహెచ్డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆందోళన దిగి విసి, ప్రిన్సిపల్ కార్యాలయం పై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేసిన కేసులో ఏడుగురు విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు రిమాండ్ కు తరలించారు. అయితే విద్యార్థులు చేతులకు కాళ్ళకు కట్లు కట్టుకొని పోలీసులు కొట్టారని ఆందోళన దిగడం విపాదాస్పదంగా మారింది. విద్యార్థులను తాము కొట్టలేదని, చట్టాన్ని చేతిలో తీసుకొని దాడులు చేస్తామంటే ఊర్కోబోమని సిపి రంగనాథ్ హెచ్చరించారు. పీహెచ్డీ సీట్ల భర్తీ ప్రతిభ ఆధారంగానే జరిగిందని ఎలాంటి అవకతవకలు జరగలేదని వీసి రమేష్ స్పష్టం చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ విద్యార్థుల ఆందోళన, దాడి, పోలీసుల అరెస్టు వివాదాస్పదంగా మారింది. పీహెచ్డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని అడ్మిషన్లు రద్దుచేసి కొత్తగా షెడ్యూల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ, బిసి విద్యార్థులు మూడు రోజుల క్రితం ఆందోళన దిగారు. ఆందోళనలో భాగంగా విసి, ప్రిన్సిపల్ కార్యాలయంలోకి దూసుకెళ్లి పర్నిచర్ ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు దాడి చేసిన వారిపై చేయి చేసుకుని బలవంతంగా స్టేషన్ తరలించారు. ఏడుగురు విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచగా ఏబీవీపీ విద్యార్థులు సిపి పర్యవేక్షణలో టాస్క్ఫోర్స్ పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి కొట్టారని మెజిస్ట్రేట్ ముందు చెప్పారు. మెజిస్ట్రేట్ మళ్ళీ వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించడంతో పోలీసులు ఎంజీఎం కు తరలించి వైద్య పరీక్షలు చేయించారు. కాళ్ళకు చేతులకు గాయాలయ్యాయని సిమెంట్ పట్టీలు వేశారు వైద్యులు. కట్లు చూసి పోలీసులు బాగానే కొట్టి ఉంటారని గాయపడ్డ వారికి సంఘీభావంగా కేయు విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు యూనివర్సిటీ లో ఆందోళనకు దిగారు. వారికి బిజేపి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. విద్యార్థులను కొట్టి తేనె తెట్టేను తట్టి లేపారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని గద్దె దించేదాక, విద్యార్థుల న్యాయమైన డిమాండ్ పరిష్కారం అయ్యేవరకు వెనక్కి తగ్గొద్దని అండగా ఉంటామని బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళన, రాజకీయ పార్టీల ఆగ్రహంతో వైస్ ఛాన్సలర్ తాటికొండ రమేష్, పోలీస్ కమిషనర్ ఏవి రంగనాథ్ మీడియా ముందుకు వచ్చారు. విద్యార్థులను కొట్టలేదని, వారు చేసే ఆరోపణలో వాస్తవం లేదని సిపి రంగనాథ్ స్పష్టం చేశారు. నేను దగ్గరుండి టాస్క్ ఫోర్స్ పోలీసులచే కొట్టించానని, గన్ పెట్టి బెదిరించానని చెప్పడం అబద్ధమన్నారు. కొంతమంది ఏబీవీపీ విద్యార్థులు వీసీ చాంబర్ డోర్ పగలగొట్టి, కంప్యూటర్లు ధ్వంసం చేయడంతో అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగిందని తోపులాటలో స్వల్ప గాయాలు అయ్యాయే తప్ప తాము విద్యార్థులను కొట్టలేదన్నారు. తమను పోలీసులు కొట్టారని మెజిస్ట్రేట్ ముందు చెప్పి, పాత గాయాలు చూపించి జడ్జిని కూడా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని సిపి తెలిపారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని దాడులు చేస్తే ఊరుకోబోమని ముందే హెచ్చరించినా విద్యార్థులు పట్టించుకోలేదన్నారు. కేయూలో తప్పులు జరిగితే ప్రశ్నించాలి, లీగల్ గా పోరాడాలి, కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తామంటే చూస్తు ఊర్కోబోమని సిపి హెచ్చరించారు. కేయూ పిహెచ్డీ కేటగిరి-2 అడ్మిషన్ లలో ఎలాంటి అవకతవకలు జరగలేదని వైస్ ఛాన్సలర్ తాటికొండ రమేష్ స్పష్టం చేశారు. పారదర్శకంగా ప్రతిభ ఆధారంగానే అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించామని చెప్పారు. దౌర్జన్యం చేస్తే పాలకవర్గం లొంగుతుందని కొందరు భావిస్తున్నారని, అలాంటి బెదిరింపులకు భయపడమన్నారు. మాకు కులం, మతంతో సంబంధం లేదని, రూల్స్ కు అనుగుణంగానే సీట్లు కేటాయించామని స్పష్టం చేశారు. డోర్లు తన్నుకుంటు, అసభ్య పదజాలంతో నా చాంబర్ కు వచ్చి కొందరు విద్యార్థులు గలాటా చేశారని చెప్పారు. అక్రమ మార్గంలో పిహెచ్డీ అడ్మిషన్లు పొందేందుకు కొందరు మెరిట్ లేని వారు ఆందోళనతో యూనివర్సిటీని అభాసు పాలు చేస్తున్నారని కేయూ విసి డాక్టర్ తాటికొండ రమేష్ అంటున్నారు. విద్యార్థుల ఆందోళన, అరెస్టు, గాయాలు, పోలీసులపై విమర్శలు, విసిపై ఆరోపణలు వివాదాస్పదమై రాజకీయంగా హాట్ టాపిక్ గా మారాయి.

# ఖమ్మం నియోజకవర్గానికి నిధుల వరద



**ఖమ్మం- ప్రభాత సూర్యుడు :** ఖమ్మం నియోజకవర్గానికి నిధులు మంజూరయ్యాయి. పది రోజుల క్రితమే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం 690 కోట్లు కేటాయించింది. ఖమ్మం అభివృద్ధి కోసం ఇవాళ 100 కోట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మ మంజూరు చేసారు. మంత్రి పదవి చేపట్టి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా మంత్రి కేటీఆర్ ను మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుక్రవారం కలిసారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా వంద కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. ఖమ్మం అభివృద్ధికి మరింత ఊతమిస్తుంది అంటూ కేటీఆర్ కు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## అదుపు తప్పిన కారు.. విద్యార్థులకు గాయాలు

**రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి జిల్లా మైలర్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధి శంషాబాద్ ప్రధాన రహదారి సర్వీస్ రోడ్ లో కారు బీభత్సం సృష్టించింది. ఆగి ఉన్న డిసిఎం వ్యాన్ ను కారు ఢీ కొట్టింది. కారు లో ప్రయాణిస్తున్న ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కాలేజ్ కు బంక్ కొట్టి యాప్ ద్వారా కారు అద్దెకు తీసుకొని విద్యార్థులు షికార్లు కొడుతున్నారు. ఎవరిదో లైసెన్స్ యాప్ లో అప్ లోడ్ చేసి కారు అద్దెకు విద్యార్థుల తీసుకుంటున్నారు. నిర్వాహకులు డ్రైవింగ్ రాకపోయిన కారు అద్దెకు ఇస్తున్నట్లు గుర్తించారు. డ్రైవింగ్ సరిగ్గా రాకపోవడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కండిషన్ లేని బండ్లను అద్దెకిస్తున్నారు. యువత ప్రాణాలతో చెలగడం ఆడుతున్నారు.

## గంజాయి స్మగ్లర్ అరెస్టు

**రాచకొండ- ప్రభాత సూర్యుడు :** బీహార్ మహాదేవ్ పుర నుండి హైదరాబాద్ కు గంజాయి తీసుకువచ్చి అమ్ముతున్న బీహార్ కు చెందిన లాల్ దాసు అనే వ్యక్తిని చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేసారు. నిందితుడి నుండి 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నైట్ టైం లో వెహికల్ చెకింగ్ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితున్ని అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నాం. అదే విధంగా యాదగిరి గుట్ట పీఎస్ పరిధిలో 2.5కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నానీ. గంజాయి పై ఉక్కుపాదం కొనసాగుతుందని పోలీసులు వెల్లడించారు....

## నాగుపల్లిలో ఉద్రిక్తత

**భద్రాద్రి- ప్రభాత సూర్యుడు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లిలో అటవీశాఖ అధికారులకు గిరిజనులకు మధ్య వాగ్వాదం జరిగింది. అటవీశాఖ భూముల్లో గిరిజనలు మొక్కలు నటుతున్నారంటూ. గిరిజనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ భూములు మావే అంటూ అటవీశాఖ అధికారులతో గిరిజనులు వాగ్వాదానికి దిగారు.

## కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ

**తుగ్గలి - ప్రభాత సూర్యుడు :** మండల పరిధిలోని జొన్నగిరి గ్రామపంచాయతీ నందు నూతనంగా మంజూరైన పింఛన్లను విద్యా కమిటీ చైర్మన్ రఘు శుక్రవారం రోజున గ్రామ సచివాలయం నందు పంపిణీ చేశారు. గత నెలలో నిర్వహించిన జగనన్న సురక్ష అనే కార్యక్రమం ద్వారా అర్హత కలిగి ఉండి పథకాలు అందలేనటువంటి లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఆయన తెలియజేశారు. సురక్ష కార్యక్రమం ద్వారా ఎంపికైన 13 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా సీఎం జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన తెలియజేశారు. పింఛన్ మంజూరైన లబ్ధిదారులు సీఎం జగన్మోహన్ రెడ్డి కు రుణపడి ఉంటామని లబ్ధిదారులు తెలియజేశారు.

## బాసరలో సామూహిక వరలక్ష్మి పూజలు

**నిర్మల్- ప్రభాత సూర్యుడు :** జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో శుక్రవారం చివరి శ్రావణమాసం కావడంతో శ్రీవరలక్ష్మి అమ్మవారి వ్రతంతో పాటు సామూహిక కుంకుమార్చన పూజలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు,దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కుంకుమార్చన పూజ కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు,వేద పండితులు వేదమంత్రోచ్ఛరణాల మధ్య సరస్వతి, మహాలక్ష్మి,మహాకాళి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం 200 మంది మహిళలు సామూహికంగా కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. పూజ అనంతరం భక్తులు సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ఒకరినొకరు మహిళలు వాయినాలు ఇచ్చుకున్నారు. శ్రావణమాసంలో సకల దేవతలకు పూజలు, వ్రతాలు చేస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. చాణుక్యుల కాలంలో ఏర్పాటుచేసిన శ్రీ గాదె హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు అందరూ కలిసి ఆలయపున నిర్మాణంలో భాగంగా శిఖర ప్రతిష్టన చేశారు, ముందుగా గ్రామస్తులు గ్రామంలో ఉత్సవ శిఖరాలను ఊరేగింపుగా తీసుకెళ్లి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు....

## యూరియా కోసం రైతుల ఎదురుచూపులు

**నల్గొండ- ప్రభాత సూర్యుడు :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాంతో.. ఉన్న కొద్దిపాటి యూరియా కోసం రైతులు ఎగబడుతున్నారు. గత మూడు రోజులుగా వర్షాలు పడుతుండడంతో.. రైతులకు యూరియా అవసరమైంది. ఈ క్రమంలో.. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పరిధిలోని పలు వ్యవసాయ సహకార సంఘం కేంద్రం, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. కాగా కావాలనే యూరియా కృత్రిమ కొరత చూయించి.. బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

## డీజీపీని కలిసిన కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు :** టీపీసీసీ నేతలు డీజీపీ అంజనీకుమార్ ను శుక్రవారం కలిసారు .పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధులు అయనను కలిసారు. ఈనెల 16,17,18 తేదీలలో జరగబోయే సిడబ్యుసి సమావేశాలు, బహిరంగ సభ కు సంబంధించి భద్రత అంశాలపై డీజీపీ కి విజ్ఞాపన పత్రం ఇచ్చారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215